విజయవాడ
శనివారం,
14 ఫిబ్రవరి 2026
సంపుటి: 22, సంచిక: 45
వెల : 5/- పేజీలు : 12

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

Published From Vijayawada, Visakhpatnam, Tirupati




**సనాతన ధర్మ ప్రచారానికి జీవితాన్ని అర్పించిన పొన్న కృష్ణమూర్తి**


నిజమైన ధార్మికతకు దక్కనున్న గౌరవం

- 5లో

# సంక్షేమం- అభివృద్ధి సమతూకం

## 20 నెలల్లో ఎంతో చేశాం..భవిష్యత్తులో మరింత చేస్తాం

- రూ. లక్ష కోట్లతో ఉద్యాన హబ్ గా రాయలసీమ అభివృద్ధి
- గాడిలో విద్యుత్ వ్యవస్థ -తొలిసారిగా విద్యుత్ ఛార్జీల ట్రూడౌన్
- జనాభా నిర్వహణ కోసం ఈ సెషన్ లోనే పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ
- నల్లమల సాగర్ పై తెలంగాణ అభ్యంతరాలు ఎందుకు
- ఫ్యాక్షన్ మనస్తత్వంతోనే హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు
- గత పాలనలో జరిగిన మద్యం స్కాంను సుప్రీం కోర్టు కూడా తప్పు పట్టింది
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చంద్రబాబు



**కూటమి అధికారంలోకి వచ్చాక సంక్షేమం- అభివృద్ధి సమతూకంగా సుపరిపాలన ప్రజలకు అందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్నికల్లో వాగ్దానాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు... అభివృద్ధి బాట పట్టించామని వెల్లడించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా అసెంబ్లీలో శుక్రవారం చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. గత 20 నెలలుగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వ పాలన వల్ల కలిగిన ఇబ్బందులను ఎలా అధిగమించింది వెల్లడించారు.**

**అమరావతి, ఫిబ్రవరి 13**

నాటి ప్రభుత్వం చేసిన దురాగతాలను ఎండగట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమాన్ని అడ్డుకునేలా కొందరు కుట్రలు పన్నుతున్నారని సీఎం చంద్రబాబు శాసన సభలో అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుం టోంది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పని చేశాయి. గత ప్రభుత్వ హయాంలో పాలకులు అసెంబ్లీలో అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నాను. 2019-24 మధ్య నాలాగే చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్న పరిస్థితి. విశాఖ వెళ్తే పవన్ కల్యాణ్‌ను అడ్డుకున్నారు. గతంలో అరాచకాలు చేసిన వాళ్లు ఇప్పుడు నీతులు చెబుతు న్నారు. ప్రజలు ప్రతీ అంశాన్నీ గమనిస్తూనే సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు. దాని ఫలితమే కూటమి అద్భుత విజయం. రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై అధికారంలోకి వస్తూనే 7 శ్వేత పత్రాలను విడుదల చేశాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆదుకున్న కేంద్రానికి ధన్యవాదాలు. నెలకు రూ. 2,750 కోట్ల మేర ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌గా అందిస్తున్నాం. ఏడాదికి రూ.33 వేల కోట్ల మేర నిధులు వెచ్చిస్తున్నాం. తల్లికి వందనం స్కీం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 43.5 కోట్ల ప్రయాణాలు జరిగాయి. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లను అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్నాం. సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారందరినీ ఆదుకునేలా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం. పీ4 ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. సంపద ఉంటేనే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయగలం... సంపద పంచగలం. అందుకే జీరో పావర్టీ ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్ర మాన్ని రాష్ట్రంలో చేపట్టాం. అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి చేయూత అందించేందుకు పీ4 కార్యక్రమం. పేదరిక నిర్మూలనకు సంబంధించి

- మిగతా 2వ పేజీలో



# నిరాడంబరంగా సేవాతీర్థ్ ప్రారంభోత్సవం

- 2లో

## 'కర్తవ్యభవన్'బ్లాకులూ ఆరంభం

కొత్త అధ్యాయానికి చిహ్నంగా రూ.100 నాణెం విడుదల

కొత్త పీఎంఓలో పలు కీలక నిర్ణయాలపై మోదీ సంతకాలు

న్యూఢిల్లీలోని బ్రిటిష్ కాలం నుంచి ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ)గా ఉన్న సౌత్ బ్లాక్ కొత్త చిరునామా 'సేవాతీర్థ్'కు మారింది. ఆధునికహంగులతో నిర్మించిన పీఎంఓతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ సేవాతీర్థ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు.



# అమెరికా ఒప్పందంపై దేశవ్యాప్త ఉద్యమం!

రైతు సంఘాలతో రాహుల్ భేటీ.. అన్నదాతలు, రైతు కూలీల జీవనోపాధిపై చర్చ

- 6లో



# బొత్స వర్సెస్ లోకేశ్



## ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలపై మండలిలో వాడీవేడి చర్చ

గత ప్రభుత్వంలో ఇంటర్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పెట్టలేదు

ఫలితంగా 12 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలను వీడారు

చర్చకు భయపడి వైఎస్సార్సీపీ సభ్యులు వాకౌట్ చేస్తున్నారన్న లోకేశ్

**ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరా ల్లో వాడీవేడి చర్చ జరిగింది. రూ. 7800 కోట్ల బకాయిలుం డగా, 1200 కోట్లు మాత్రమే చెల్లించేందుకు ఆదేశాలిచ్చారని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు అన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న 5 క్వార్టర్ల బకాయిలు ఎప్పుడిస్తారో చెప్పాలని విపక్షనేత బొత్స నిలదీశారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీల అరోపణలు ఖండిస్తూ మంత్రులు నారా లోకేశ్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి దీటుగా సమాధానం ఇచ్చారు.**

**అమరావతి, ఫిబ్రవరి 13**

2014-19 బకాయిలు రూ. 224 కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు చెల్లించలేదని మంత్రి డీఎస్‌బీవీ స్వామి తెలిపారు. బకాయిల విషయంలో ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామని బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బొత్స సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఎందుకు తీసేశారో తెలపాలన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 4064 కోట్లు

- మిగతా 6వ పేజీలో

# టీవీకే ఎవరితోనూ పొత్తు పెట్టుకోదు

## పార్టీ అధ్యక్షుడు విజయ్ స్పష్టీకరణ

అధికార డీఎంకే పార్టీ ఉచిత పథకాలు, వరాలపై కౌంటర్

సీఎంకు ఎన్నికలప్పుడే హామీలు గుర్తొస్తాయి అని ఎద్దేవా

తాత్కాలిక ప్రయోజనాల కంటే శాశ్వత అభివృద్ధి ముఖ్యం



- 6లో



# రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాలి

## పాలక మండళ్లు బాధ్యతగా ఉంటే ఆలయాల్లో అపచారాలు జరగవు

- గత పాలక బాధ్యతగా ఉంటే అపచారాలు జరిగేవి కాదు
- గతంలో జరిగిన తప్పులు పునరావృతం కారాదు
- కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి కట్టుబడి ఉంటుంది
- శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- 2లో

# ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే!

- 2లో

## ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ముందుకు సాగడం ద్వారా ఉత్తమ ఫలితాలు

చిత్తూరు ప్రజాప్రతినిధులతో భేటీలో సీఎం చంద్రబాబు

తన నియోజకవర్గ పనితీరునూ విశ్లేషించుకున్న సీఎం


ఎమ్మెల్యేల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టు అందజేత

'కుప్పం నియోజకవర్గ ప్రజల్లో నేను మరింత అందుబాటులో ఉంటే బాగుండు అనే భావన ఉంది. దీన్ని సరిదిద్దేందుకు తరచూ కుప్పంకు వస్తాను. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండే విషయంలో మీరైనా, నేనైనా ఏ మాత్రం రాజీ పడే ప్రసక్తే ఉండకూడదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.



# పార్లమెంటులో మాటల యుద్ధానికి విరామం

## ముగిసిన బడ్జెట్ సమావేశాల తొలి దశ



- 2లో

అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం, మాజీ సైన్యాధ్యక్షుడు ఎం.ఎం.నరవణె పుస్తకం సహా పలు అంశాలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్ర విమర్శలు, ప్రతి విమర్శలతో వాడీవేడిగా సాగిన పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలి దశ శుక్రవారంతో ముగిసింది. మలి దశ సమావేశాలు వచ్చే నెల 9న ప్రారంభం కానున్నాయి.

# సంక్షేమం- అభివృద్ధి సమతూకం

**(మొదటి పేజీ తరువాయి)**

దేశంలోనే ఇది అత్యుత్తమ మోడల్."అని సీఎం చంద్రబాబు చెప్పారు. "పీపీపీ వల్ల సంపద సృష్టి జరుగుతోంది. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఈ విధానంలోనే నిర్మితం అవుతున్నాయి. పీపీపీ విధానంలో ప్రాజెక్టు నిర్మించి నిర్వహిస్తారు. నిర్దిష్ట కాలపరిమితి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. క్వాంటం నైపుణ్యాల కోసం కోర్సు నిర్వహిస్తుంటే 60 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఇంధన రంగంలో ట్రాన్సిషన్ సమయం నడుస్తోంది. హరిత ఇంధనానికి డిమాండ్ ఉంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఓ మోడల్ అవుతాయి. ఏపీలో ప్రొజ్యూమర్ విధానంలో ఇంధన ఉత్పత్తి చేయాలని భావిస్తున్నాం. సోలార్ ప్యానళ్లను ఇళ్లపై ఏర్పాటు చేసుకుని గ్రిడ్ కు అనుసంధానిస్తాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య సేవలను విస్తృతం చేస్తాం. ఈ నెల 16 తేదీన బిల్ గేట్స్ రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేసి వ్యక్తిగత ఔషధాలను కూడా అందించే అవకాశం ఉంది. సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సెషన్లోనే పాలసీ తెస్తాం. డెమో గ్రాఫిక్ డివిడెండ్ ను సమర్ధంగా వినియోగించుకోవడం ద్వారా సంపద సృష్టించేందుకు అవకాశం ఉంటుంది. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఏడాది లోగానే టీచర్లకు పోస్టింగులు ఇచ్చాం. కానిస్టేబుళ్ల నియామకాలు కూడా పూర్తి చేసి స్టైఫండ్ ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచాం. భూమి ఇవ్వకుండా, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి...? ప్రముఖ పరిశ్రమలకు భూములు ఇస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీకే వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువ ఏమిటో అందరూ అర్ధం చేసుకోవాలి. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్ రాజా బ్యాటరీస్ పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయింది. విశాఖలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. అనకాపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నాయి. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ కూడా రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు 610 ఎంఓయులు చేసుకున్నాం. మొత్తంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల ఉద్యోగాలను ఐదేళ్లలో ఇస్తామన్న హామీని నిలబెట్టు కుంటాం."అని సీఎం స్పష్టం చేశారు.

"గత పాలకులు సమర్ధంగా నీటి నిర్వహణ చేపట్టలేదు. ఎన్టీఆర్ హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ లాంటి ప్రాజెక్టులతో రాయలసీమలో ప్రాజెక్టులు చేపట్టారు. వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేస్తాం. పోలవరం- వంశ ధారను లింక్ చేస్తాం. ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాది అనకాపల్లి వరకూ నీటిని తీసుకెళ్తాం. హంద్రీనీవా కాలువలను పూర్తి చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకువెళ్లాం. చెరువులు నింపాం. రాయచోటికి కూడా నీరు తీసుకెళ్తాం. గాలేరు నగరి ద్వారా వచ్చే ఏడాది కడపకూ నీళ్లు పారిస్తాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎమ్మెల్యేలు కూడా ప్రత్యక్షంగా చూడాలని కోరుతున్నాను. గత పాలకులు రాజకీయ కక్షతో పోలవరాన్ని గోదాట్లో ముంచేశారు. డయాఫ్రాం వాల్ ధ్వంసం చేశారు. ఇప్పుడు రూ. 1000 కోట్లతో మళ్లీ డయాఫ్రాం వాల్ నిర్మిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నెలలోగా జాతికి అంకితం చేస్తాం. ఏటా 3500 టీఎంసీల గోదావరి వరద జలాలు సముద్రంలోకి వృధాగా పోతున్నాయి. అందులో 200 టీఎంసీల నీటిని నల్లమల సాగర్ కు తరలిస్తాం. ఈ ప్రాజెక్టుకు తెలంగాణా అభ్యంతరం చెప్పటం సరికాదు. తెలుగు జాతిగా రెండు రాష్ట్రాలూ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైతే ఈ అంశాన్ని సంప్రదింపుల ద్వారా ఓ నిర్ణయానికి రావచ్చు. ఒకటి రెండు అంశాలు పరిష్కారం అయితే కూర్చుని మాట్లాడు కుందామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రతిపాదించారు. నల్లమల సాగర్ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరికాదు. రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమను ఉద్యాన హబ్ గా తయారు చేస్తాం. రూ.30 వేల కోట్ల మేర ప్రభుత్వ నిధులు... రూ.70 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడులతో సీమలో హార్టీకల్చర్ అభివృద్ధి చేస్తాం. ప్రస్తుతం ఏడాదికి 400 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పండ్ల ఉత్పత్తి జరుగుతోంది. భవిష్యత్తులో 1000 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులకు కేంద్ర స్థానంగా రాయలసీమ ఎదుగుతుంది. అక్వా కల్చర్ గత పాలనలో ఒడిదుడుకులు ఎదుర్కొంది. రూ.1.50 యూనిట్ చొప్పున విద్యుత్ ను ఆక్వాకు ఇస్తున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆక్వా కల్చర్ హబ్ గా మన ప్రాంతం తయారవుతుంది. ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో డబ్బులు చెల్లించింది కూడా కూటమి ప్రభుత్వమే. కోకోనట్, కోకో, కాఫీ లాంటి పంటలపై కేంద్రం దృష్టి సారించింది. దీనిపై మరింత శ్రద్ధ పెట్టి వ్యాల్యూ అడిషన్ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఏపీలో రైతుల ఆత్మహత్యలను నివారించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతీ ఘటననూ ఆడిట్ చేయిస్తాం. విద్యార్ధులు కూడా ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎదుర్కోవాలి. ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదు."అని సీఎం చెప్పారు. "లాజిస్టిక్స్ రంగంలో పెనుమార్పులు సాధించేలా నిర్ణయం తీసుకుంటున్నాం. రైల్వే రంగంలో రూ.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండేళ్లలో ఇచ్చాపురం నుంచి దిగువ వరకూ నాలుగు లేన్ల ట్రాక్ వచ్చే అవకాశం ఉంది. తద్వారా కార్గో, ప్రయాణికుల మార్గాలు విస్తృతం అవుతాయి. జాతీయ రహదారులు కూడా పెద్దఎత్తున నిర్మించేలా కేంద్రం ప్రాజెక్టులు ప్రతిపాదించింది. డబుల్ ఇంజన్ సర్కారులో ట్రిబుల్ ఫలితాలు వచ్చేలా ప్రయత్నాలు చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను రూ.4 వేల కోట్లతో అనుసంధాని స్తున్నారు. విద్యుత్ రంగాన్ని గత పాలకులు విధ్వంసం చేశారు. గత పాలకులు రూ. 32,166 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల విద్యుత్ వాడకుండానే సోలార్, విండ్ ప్రాజెక్టుల్లో రూ.9 వేల కోట్లు కట్టాల్సి వచ్చింది. ఫ్యూయల్ సర్చార్జి భారం రూ.12,617 కోట్ల మేర వేశారు. మొత్తంగా రూ. 1,22,422 కోట్లను గత ప్రభుత్వం విద్యుత్ బకాయిలు పెట్టి పోయింది. 78 నుంచి 90 శాతం మేర కరెంటు ఛార్జీల భారం ప్రజలపై వేశారు. మేం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం దానికి కట్టుబడి ఉన్నాం. రూ.4,860 కోట్ల ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. వచ్చే మూడేళ్ల లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేసేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే మాకు అందాయి. అడిగిన భూములు ఇవ్వకపోతే వాటిని 22ఏలో పెట్టేశారు. చట్టాలు చేసిన ముఖ్యమంత్రే నాడు చట్టవ్యతిరేక కార్యక్రమాలు పాల్పడ్డారు. బాధితులు ఇంక ఎవరికి చెప్పుకుంటారు...? తాడేపల్లి ప్యాలస్ సమీపంలో హెలిప్యాడ్ కట్టడం కోసం ఓ భూమి అడిగారు. ఆ భూమి ఇవ్వకపోతే బలవంతంగా 22ఏలో పెట్టేశారు. గత పాలకులు రూ.33 లక్షలతో హెలిపాడ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం జీవో ఇచ్చేశారు. మదనపల్లిలోని ఆర్డీఓ ఆఫీసులో రెవెన్యూ రికార్డులు తగులబెట్టారు. వాళ్లు చేసిన పాపం కడగడానికే ఏడాది సమయం పట్టింది. 2026లో ఈ రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి రాజ ముద్రతో పాస్ పుస్తకాలు జారీ చేస్తాం. ప్రతీ ఒక్కరి భూమికి భద్రత ఇచ్చేలా కార్యాచరణ చేపడుతున్నాం. గత పాలకులు ఇసుకను కూడా దోపిడీ చేశారు. దానిని పరిష్కరిస్తూ ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేస్తున్నాం. మద్యం వ్యవహారంలోనూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టారు. రూ.3200 కోట్ల మేర మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. ఏపీలో గత పాలనలో జరిగిన మద్యం స్కాంపై కోర్టులు కూడా సీరియస్ అయిన పరిస్థితి. మెరుగైన మద్యం పాలసీ తెచ్చాం. హోలో గ్రామ్, బ్యాచ్ నెంబర్ సహా భద్రతా ఫీచర్లతో ఎక్కడా నకిలీకి ఆస్కారం లేకుండా చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. "శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు. రాజకీయ ముసుగులో కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశం. కొందరు కావాలని దేవుడి పవిత్రతను, భక్తుల మనోభావాలు దెబ్బతీయాలని ప్రయత్నించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక్కసారైనా శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించు కోవటం ఆనవాయితీ. జరిగిన తప్పులను చెప్పక పోతే అక్రమార్కులు తప్పే జరగలేదని బుకాయిస్తారు. టీటీడీ సహా అన్ని దేవాలయాల్లో పవిత్రతను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. కల్తీ నెయ్యి సరఫరా చేసిందే కాక.. ఆ వివాదంలోకి హెరిటేజ్ సంస్థను తీసుకు వచ్చారు. వివేకా హత్య కేసు ఘటనలో ఎన్ని నాటకాలు ఆడారు. సాక్షి పత్రికలో నారాసుర రక్త చరిత్ర అని రాశారు. వాళ్లు చేసిన నేరాన్ని తప్పించుకోవడానికి ఇతరులపై నెట్టేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ సంస్థకు ముడిపెట్టి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. హెరిటేజ్ అనేది ఫ్యామిలీ బిజినెస్. లైవ్ లీ హుడ్ కింద వ్యాపారం చేస్తున్నారు. బ్రాండ్ దెబ్బతీసేలా ఆ పత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురిస్తున్నారు. గతంలో రాయలసీమ ఫ్యాక్షన్లో భాగంగా కక్ష తీర్చుకునేందుకు చీనీ చెట్లను నరికి వేసేవారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బ తీయాలనేది ఫ్యాక్షనిస్టులకు అలవాటు. దాంతో ప్రత్యర్థులు తీవ్రంగా నష్ట పోయే పరిస్థితి. ఇప్పుడు ఇలాంటి వ్యవహారాన్నే వాళ్లు నడిపిస్తున్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా ప్రణాళికలు చేశాం. పది సూత్రాల ద్వారా ఈ విజన్ ను సాధించేందుకు లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీని తీర్చిదిద్దుతాం. 2047కు భారత్ నెంబర్ వన్ ఎకానమీగా ఉంటుంది. అందులో ఏపీ అగ్రస్థానానికి చేరుతుంది. అత్యధిక తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.

# రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాలి

**అమరావతి, ఫిబ్రవరి 13**



పాలక మండళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని, రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలోనే ఎన్నో అపచారాలు జరిగాయన్నారు. నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తప్పులు జరిగేవి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆలయ పాలక మండళ్లు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ రోడ్డును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్ గా శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సుమారు రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో గిరి ప్రదక్షణ రోడ్డును నిర్మించారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "మన ఆలయాలు నాగరికతకు చిహ్నాలు. మన కళలు, మన వారసత్వం, మన సంస్కృతి, ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. అరుణాచలంలో గిరిప్రదక్షణ చేస్తారు అని తెలుసు. నాకు గిరిప్రదక్షణ చేయాలని చాలా కోరిక ఉంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు, భక్తుల కోరిక మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి కచ్చితంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటాను. శివరాత్రికి రెండు రోజుల ముందు ఈ శ్రీకాళహస్తి గిరి ప్రదక్షణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేవాదాయ మంత్రిగా రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళ్తున్నాం. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారు. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

### శివరాత్రి తర్వాత గిరిప్రదక్షణ మార్గంలో మొక్కలు నాటుతాం..

శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూ. 10 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించాం. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిప్రదక్షణ మార్గానికి ఇరు వైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీకారం చుట్టబోతున్నాం. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ ద్వారా ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షణ చేసిన పుణ్యఫలం దక్కాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

### 40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రోడ్లు

"ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గ నిర్దేశకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి అడుగులో మన సనాతన ధర్మ ఔన్నత్యాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తూ.. ఆలయాలు, ఆలయాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. ఆ ప్రక్రియలో భాగంగా దేవాదాయశాఖ సహకారంతో ఏలూరు జిల్లా ఐ.ఎస్. జగన్నాథపురంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం ఉన్న కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు రూ. 3 కోట్ల 70 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టాం. ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ పరిసరాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇటీవల కోటప్పకొండ నుంచి కొత్తపాలెం గ్రామం వైపు వెళ్లే రోడ్డును సుమారు రూ. 4 కోట్లతో తో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం. వాడపల్లి ఏడువారాల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్ధం గోదావరి కరకట్ట వెంబడి రోడ్డు నిర్మాణానికి రూ. 6 కోట్ల సాస్కీ నిధులు మంజూరు చేశాం. ఉపాధి హామీ పథకం, పంచాయ తీరాజ్, సాస్కీ నిధులతో రూ. 40 కోట్లకు పైగా వెచ్చించి సుమారు 22 ప్రధాన దేవాలయాలకు రోడ్డు వసతి కల్పిస్తున్నాం. మరెన్నో చిన్న ఆలయాలకు రవాణా సౌకర్యాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నాం. నూతన శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో అరుణాచలం మాదిరి ప్రతి పౌర్ణమికీ ప్రత్యేకంగా శ్రీకాళహస్తి కైలాస గిరి ప్రదక్షణ నిర్వహించాలని సూచిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికీ, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని" అన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నుంచి వర్చువల్ గా తిరుపతి జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, రాష్ట్ర హస్త కళల నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, తిరుపతి ఫారెస్ట్ కన్జర్వేటర్ సెల్వం, డీఎఫ్ఓ సాయిబాబా పాల్గొన్నారు.

# నిరాడంబరంగా సేవాతీర్థ్ ప్రారంభోత్సవం

దేశ రాజధానిగా న్యూఢిల్లీ 1931 ఫిబ్రవరి 13న అధికారికంగా ఏర్పాటై 95 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆ ధునికత, సమర్థత, పారదర్శకత లక్ష్యంగా నిర్మించిన ఈ సముదాయం భారత పరిపాలనా వ్యవస్థలో సరికొత్త అధ్యాయానికి శ్రీకా రం చుట్టింది. ఈ క్షణాన్ని గుర్తుచేసుకునేందుకు, ప్రధానమంత్రి ఈ సందర్భంగా రూ. 100 స్మారక నాణేన్ని కూడా విడుదల చేశా రు. ఈ సముదాయం గోడపై 'నాగరికో దేవో భవ' (ప్రజలే దేవుళ్లు) అనే నినాదాన్ని పొందుపరిచారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వా త పీఎంఓ వేరేచోటుకు మారడం ఇదే మొదటిసారి. సేవాతీర్థ్‌తోపాటు కీలక మంత్రిత్వ శాఖల కోసం నిర్మించిన 'కర్తవ్య భవన్' 1, 2 బ్లాకులను కూడా ప్రధాని ప్రారంభించారు. కొత్త కార్యాలయంలో అడుగుపెట్టిన వెంటనే ప్రధాని పలు కీలక నిర్ణయాలపై సంతకాలు చేశారు. ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించే 'పీఎం రాహత్' పథకానికి ఆమోదం తెలిపారు. మహిళా సంఘాల సభ్యులను లక్షాధికారులుగా మార్చే 'లఖ్‌పతి దీదీ' పథకం లక్ష్యాన్ని 3 కోట్ల నుంచి 6 కోట్లకు పెంచారు. 2029 మార్చి నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా మౌలిక సదుపాయాల నిధిని లక్ష కోట్ల నుంచి రెండు లక్షల కోట్లకు పెంచుతూ ప్రధాని నిర్ణయం తీసుకున్నారు. అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు రూ.10 వేల కోట్లతో 'స్టార్టప్ ఇండియా 2.0' నిధికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పాత భవనాల్లో విడివిడిగా ఉన్న ప్రధానమంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, క్యాబినెట్ సెక్రటేరియట్ ఇకపై ఈ కొత్త సముదాయం నుంచే పనిచేస్తాయి. ఈ నూతన భవనాలు పర్యావరణ హితంగా 4-స్టార్ గృహ (జీఆర్ఐహెచ్ఏ) ప్రమాణాలతో నిర్మించారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే!

ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల పరస్పర సమన్వయంతో పాలనలో వేగం పెంచేందుకు ప్రారంభించిన 'ప్రజాప్రతినిధులతో భేటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన చిత్తూరు జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు కలెక్టర్, ఎస్పీలు కూడా హాజరయ్యారు. సుమారు 2 గంటలపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్వయంగా తన నియోజకవర్గానికి సంబంధించిన అంశాలనూ చంద్రబాబు చర్చించడం గమనార్హం. చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులందరి పనితీరు బాగుందని, అలాగని సంతోష పడకుండా ఎక్కడ వెనుకబడి ఉన్నామో.. దానిపై దృష్టి సారించి మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి ముందుకు సాగడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కూటమి ప్రభుత్వ ముద్ర కనబడేలా పనిచేయాలన్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు విషయంలో ప్రజల్లో సానుకూల దృక్పథం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం చర్చించారు. 20 నెలల్లో స్థానికంగా తీసుకున్న చర్యలు, వచ్చిన ఫలితాలు, రాజకీయ స్థితిగతులు, రానున్న 3-4 నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పరిష్కరించాల్సిన అంశాలపై ఎమ్మెల్యేలతో సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రజల సమస్యలపై ప్రజాప్రతినిధులు ఇచ్చే ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. 'చిత్తూరు జిల్లాలో నేను, అమర్నాథ్ రెడ్డి తప్ప మిగిలిన వారంతా తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లే. తొలిసారి ఎమ్మెల్యేలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలి. ప్రజల్లో కలిసిపోయి వారి సమస్యలు పరిష్కరించాలి' అని చంద్రబాబు సూచించారు. వివిధ మార్గాల ద్వారా తాను తెప్పించుకున్న సర్వేలు, నివేదికల ఆధారంగా వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ఎమ్మెల్యేలతో పంచుకున్నారు. ప్రధానంగా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, మీడియా, సోషల్ మీడియాలో చొరవ చూపడం, స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం, అధికారులతో సమన్వయం చేసుకోవడం, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడం, పొలిటికల్ యాక్టివిటీ చేయడం వంటి అంశాలపై ఎమ్మెల్యేల పనితీరు గురించి సవివరంగా చర్చించారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై నివేదికను సీల్డ్ కవర్‌లో సీఎం చంద్రబాబు వారికి అందజేశారు. అందులో ఎమ్మెల్యే పనితీరు ఆధారంగా.. రాష్ట్రస్థాయిలో ఏ స్థానంలో ఉన్నారు, జిల్లా స్థాయిలో ఏ స్థానంలో ఉన్నారనే దానిపై ర్యాంకులు ఇచ్చారు. బాగా పనిచేసిన వారిని అభినందిస్తూ.. వెనుకబడిన వారికి సూచనలు చేశారు. అధికారులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు కృషి చేయాలని, అధికారులు కూడా ఆయా సమస్యలపై మరింత వేగంగా స్పందించాలని సూచించారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాల వినియోగం ఎలా జరుగుతుందని ఆరా తీశారు. ఆ కార్యాలయాలు, సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో మరింత కఠినంగా ఉండాలని ఎస్పీని ఆదేశించారు.

# పార్లమెంటులో మాటల యుద్ధానికి విరామం

ఈలోగా- కేంద్ర బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వ శాఖలకు దక్కిన కేటాయింపులను పార్లమెంటరీ స్థాయీసంఘాలు పరిశీలిస్తాయి. బడ్జెట్ సమావేశాల తొలి దశ చివరి రోజు కూడా విపక్ష సభ్యుల నినాదాలతో లోక్‌సభ దద్దరిల్లింది. శుక్రవారం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీ పేరు ఉన్నందున ఆయన రాజీనామా చేయాల్సిందేననీ డిమాండ్ చేశారు. గందరగోళం మధ్య సభ తొలుత గంటసేపు, అనంతరం మార్చి 9 వరకు వాయిదా పడింది. రాజ్యసభను కూడా శుక్రవారం శూన్యగంట అనంతరం అదే తేదీకి వాయిదా వేశారు. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2న ముగుస్తాయి. గత నెల 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంతో బడ్జెట్ సమావేశాల తొలి దశ ప్రారంభమైంది. 2020 నాటి భారత్-చైనా ఘర్షణకు సంబంధించి ఎం.ఎం.నరవణె తన పుస్తకంలో చేసిన వ్యాఖ్యలను లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ సభలో ప్రస్తావించేందుకు స్పీకర్ అనుమతించకపోవడంతో.. ఈ నెల 2 నుంచి దిగువ సభలో పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సభ పదేపదే వాయిదా పడింది. అధికారుల బల్లలపై నిల్చోవడం, పేపర్లను చింపి సభాపతివైపు విసరడం వంటి అనుచిత చర్యలకు పాల్పడినందుకు ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు, ఓ సీపీఎం ఎంపీపై సస్పెన్షన్ వేటు (తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగిసేదాకా పార్లమెంటుకు రాకుండా) పడటంతో పరిస్థితులు మరింత వేడెక్కాయి. నాటి నుంచి విపక్ష నేతలు నినాదాల ఉద్ధృతిని ఇంకా పెంచారు. పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండటంతో.. లోక్‌సభకు రావొద్దని ప్రధాని మోదీకి స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. దీంతో- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా ప్రధాని రాజ్యసభలోనే ప్రసంగించారు. స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించాలంటూ విపక్షాలు ఈ సమావేశాల్లో నోటీసు సమర్పించాయి. బడ్జెట్ సమావేశాల రెండో విడతలో అది సభ ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పారిశ్రామిక సంబంధాల నియమావళిని సవరించేందుకు ఉద్దేశించిన బిల్లును తొలి విడతలో పార్లమెంటు ఆమోదించింది.

ప్రధాని మోదీ గురించి అనుచిత పదజాలంతో మాట్లాడినందుకు రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రణాళికను ప్రభుత్వం పక్కనపెట్టినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. రాహుల్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో భాజపా ఎంపీ నిశికాంత్ దుబె ఇప్పటికే 'సబ్‌స్టాంటివ్ మోషన్' కోసం నోటీసు సమర్పించడమే ఇందుకు కారణమని విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు.

ఫారం నెం. 14
(రెగ్యులేషన్ 33(2) చూడుము)
రిజిస్టర్డ్ ఎ/డి, దస్తీ ద్వారా విఫలమైనచో ప్రచురణ ద్వారా

**రికవరీ ఆఫీసర్ - I/II వారి కార్యాలయం**
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1)**
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001

**డిమాండ్ నోటీసు**

రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్రప్టసీ యాక్ట్, 1993లోని సెక్షన్‌లు 25 నుండి 28 మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూల్ యొక్క రూల్ 2 క్రింద నోటీసు
ఆర్‌సి/205/2025 03.02.2026

**కెనరా బ్యాంక్**
**వర్సెస్**
**మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్**

దిగువ వారికి
(CD 1) మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్ మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్ ప్రతినిధి దాని ప్రొప్రైటర్ శ్రీమతి యమునా యార్లగడ్డ ప్రతినిధిగా ప్రొప్రైటర్ శ్రీమతి యమునా యార్లగడ్డ ఇ.నెం. 7-2-6 /డి0/10, ఫ్లాట్ నెం., 405, శ్రీ సాయి జగపత్‌టవర్స్ దుర్గానగర్, హైదరాబాద్ - 500079. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్, తెలంగాణ-501505
మరియు మెస్సర్స్ శ్రీ నిహార్ ఇండస్ట్రీస్, ప్రతినిధిగా ప్రొప్రైటర్ శ్రీమతి యమునా యార్లగడ్డ, షెడ్ నెం. IV, సర్వే నం.17 కవాడిపల్లి గ్రామం, బాల్‌ఫగూడ రోడ్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల్, టిఎస్-501505.
(CD 2) శ్రీమతి యమునా యార్లగడ్డ భర్త శ్రీ వెంకట సుబ్రమణేశ్వర రావు, వయస్సు 33 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: 11-76, మచిలీపట్నం రోడ్, పామర్రు కృష్ణ, ఆంధ్ర ప్రదేశ్ -500001

OA/288/2023 ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యూనల్, హైదరాబాద్ (డిఆర్‌టి-1) ద్వారా జారీచేసిన ఉత్తర్వులు అనుసరిస్తూ రికవరీ సర్టిఫికేట్ ప్రకారం రూ. 8762761.45 (రూపాయలు ఎనభై ఏడు లక్షల అరవై రెండు వేల ఏడు వందల అరవై ఒకటి మరియు పైసలు నలభై ఐదు మాత్రమే) 01.08.2023 నుండి చెల్లింపు వరకు పెండెంటెలైట్ మరియు సాలుకు సాధారణ వడ్డీ వంతున భవిష్య వడ్డీ (రికవరీ సర్టిఫికెట్ ప్రకారం) ఖర్చులు రూ. 148000 (రూపాయలు ఒక లక్షా నలభై ఎనిమిది వేలు మాత్రమే) మీరు (ఉమ్మడిగా మరియు విడివిడిగా మరియు పూర్తిగా/ పరిమితంగా చెల్లించవలసి ఉన్నది)

2) కావున ఈ నోటీసు స్వీకరణ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తమును చెల్లించవలసిందిగా ఆదేశిస్తూ, విఫలమైనచో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టూ బ్యాంక్స్ మరియు ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993 మరియు అందులోని రూల్స్‌కు అనుగుణంగా వసూలు చేయబడును.
3) కావున తదుపరి విచారణ తేదిలోగా మీ ఆస్తులపై పూర్తి వివరములతో ఒక అఫిడవిట్ దాఖలు చేస్తూ ప్రకటించవలసిందిగా మిమ్ముల్ని ఆదేశించడమైనది.
4) కావున తదుపరి ప్రొసీడింగ్స్ కొరకు తేది: 17.03.2026న ఉ॥ 10.30గం॥లకు ఈ క్రింది సంతకందారు సమక్షమునకు హాజరు కావలసిందిగా మిమ్ముల్ని ఆదేశించడమైనది.
5) పైన తెలిపిన మొత్తమునకు అదనముగా మీరు చెల్లించవలసిన మొత్తము:
ఎ) సర్టిఫికెట్/ అమలుచేయు ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమగు కాలమునకు అట్టి వడ్డీలు చెల్లించవలెను.
బి) బకాయి మొత్తము వసూలు చేసుకొనుటకు అన్ని ఇతర ప్రొసీడింగ్స్ చేపట్టుటకు మరియు ఇతర ప్రాసెస్‌లు, వారెంట్లు మరియు ఈ నోటీసు సేవలకు సంబంధించి అన్ని ఛార్జీలు, ధరలు మరియు వ్యయములతో చెల్లించవలెను.

తేది: 03.02.2026న నాచే సంతకం చేసి మరియు ట్రిబ్యునల్ సీలు వేసి జారీచేయడమైనది.
రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT-1)






ఇబ్రహీంపట్నంలో ఇటీవల జరిగిన దాడిలో గాయపడిన మాజీ మంత్రి జోగి రమేష్ నివాసాన్ని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సందర్శించి పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తామని చెప్పే కూటమి నేతలు ఇటువంటి ప్రత్యక్ష దాడులకు పాల్పడితే పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి రావడానికి ముందుకు వస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణం ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, కానీ కొందరు నాయకులు దాడులు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని ఆరోపించారు. తమపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని, ఇప్పుడు ప్రత్యక్ష దాడులకు దిగుతున్న వారిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. దాడుల సంస్కృతి ప్రమాదకరమని, నాయకులపై దాడులు చేస్తే వైఎస్‌ఆర్సీపి నేతలు, కార్యకర్తలు భయపడతారని కొందరు భావిస్తున్నారని, అయితే వారు మరింత బలంగా పార్టీ కోసం పనిచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు వైఎస్‌ఆర్సీపి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేసరపల్లిలో జల్ అర్పన్ దివాస్ ర్యాలీ




కృష్ణాజిల్లా, గన్నవరం మండలం,కేసరపల్లి గ్రామంలో, గ్రామపంచాయతీ కార్యాలయంలో,గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక ఆధ్వర్యంలో శుక్రవారం "జల్ అర్పన్ దివాస్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కె.సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.,కేసరపల్లి గ్రామంలో 2023 లోనే ప్రతి ఇంటికి నీటి కుళాయి ఏర్పాటు చేసి అందరికీ సురక్షిత నీటిని అందించామని,అందరూ కూడా నీటి విలువను,ప్రాధాన్యతను తెలుసుకోవాలని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ., ఈ ప్రపంచంలో ప్రతి మనిషికి నీటి అవసరం ఉందని, మనిషి మనుగడకు పంచభూతాలు ఏ విధంగా దోహదపడతాయో, వాటిలో నీరు ముఖ్యపాత్ర వహిస్తుందని, కనుక మనమంతా నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకుంటూ కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని వివరించారు. అనంతరం "జల సంరక్షణ - మన బాధ్యత" అనే నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించి, స్థానిక వాటర్ ట్యాంక్ కు "జల రక్షాబంధన్" కట్టి, అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.స్వర్ణలత, డిప్యూటీ ఎంపీడీవో టి.భారతి, గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్.ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆర్డబ్ల్యూఎస్ ల్యాబ్ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లుకు చంద్రబాబు, పవన్ చొరవ తీసుకోవాలి

- ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. మారేష్



**అమరావతి, ఫిబ్రవరి 13 (**ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఏపీ భవన్‌వేదికగా నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ ఎన్. మారేష్ బీసీ బిల్లు సాధనకు ఇదేసరైన సమయమని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయరిజర్వేషన్లు కల్పించే బిలును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకునికేంద్రాన్ని ఒప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా చట్టసభల్లోబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడంతో వారురాజ్యాధికారానికి దూరమయ్యారని తెలిపారు.ప్రపంచంలోనే బలమైన నాయకుడిగా ఎదుగుతున్ననరేంద్ర మోదీ పదవీకాలంలోనే బీసీలకు రాజకీయరిజర్వేషన్లు రావాలని ఆకాంక్షించారు.బీసీ బిల్లు సాధన కోసం గల్లి స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలోఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని,దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని, బీసీఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలనిడిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం కేంద్ర రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారని, ఈ అనుకూల సమయంలో బీసీ బిల్లును సాధించాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీగా అవతరించాలని, ఓబీసీల గుండెల్లో చంద్రబాబు స్థానం చిరస్థాయిగా నిలవాలంటే ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని కోరారు.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం అన్యాయ మని పేర్కొన్నారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో బీసీలకు న్యాయం జరగాలంటే చట్టసభల్లో రిజర్వేషన్లు తప్పనిసరి అని చెప్పారు. రాష్ట్రంలోని 140 బీసీ కులాల తరపున ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై చర్చించాలని సీఎం చంద్రబాబు నాయుడును కోరారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దేశవ్యాప్తంగా ఓబీసీల స్థితిగతులపై అవగాహన ఉన్న వ్యక్తి అని, ఆయన బీసీ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పితాని ప్రసాద్ (స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, బీసీ సంఘం), దాసరి శ్యాంసుందర్ శేషు (తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి), యార్లగడ్డ సందీప్ (ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు), రాజశేఖర్ (తిరుపతి జిల్లా అధ్యక్షులు), బొమ్మని కోటేశ్వరావు (తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు) పాల్గొన్నారు.

### ఆధునిక ఆవిష్కరణలను అందిపుచ్చుకుని

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి







- ఏపీ ఈఎస్జీకాన్ 2026 సదస్సులో పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి
- విజయవాడ గట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఏపీ చాప్టర్ 8వ వార్షిక సదస్సు ప్రారంభం
- గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ, జీఐ ఎండోస్కోపీ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు

**విజయవాడ, ఫిబ్రవరి 13**

వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఆవిష్కరణలను వైద్యులు అందిపుచ్చుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి అన్నారు. విజయవాడ గట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏపీ చాప్టర్) 8వ వార్షిక సదస్సు "ఏపీ ఈఎస్జీకాన్ 2026" ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని హోటల్ నోవోటెల్ నందు శుక్రవారం ప్రారంభమైన ఈ రెండు రోజుల సదస్సుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి చీఫ్ ప్యాట్రన్ గా వ్యవహరించారు. ఈ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ, జీర్ణాశయ సంబంధిత వ్యాధులు, కాలేయ సమస్యలు ప్రస్తుతం వేగంగా పెరుగుతున్నాయని, వాటి నిర్ధారణ, చికిత్సల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కొత్త పద్ధతులు, అత్యాధునిక ఎండోస్కోపీ సాంకేతికతలు, మినిమల్ ఇన్వేసివ్ చికిత్సా విధానాలు రోగులకు తక్కువ నొప్పితో, త్వరితగతిన కోలుకునే అవకాశం కల్పిస్తున్నాయని చెప్పారు. వైద్యులు నిరంతరం శిక్షణ తీసుకుంటూ, తాజా పరిజ్ఞానాన్ని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సదస్సులో గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ, జీఐ ఎండోస్కోపీ తదితర ముఖ్య అంశాలపై దేశంలోని పలువురు వైద్య నిపుణులు ప్రసంగించారు. జీర్ణాశయ వ్యాధుల నిర్ధారణలో నూతన పద్ధతులు, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలో వచ్చిన అభివృద్ధి, క్యాన్సర్ ప్రారంభ దశలో గుర్తింపు, అడ్వాన్స్డ్ ఎండోస్కోపిక్ టెక్నిక్స్ వంటి విషయాలపై చర్చలు జరిగాయి. యువ వైద్యులకు ఈ సదస్సు ఒక మంచి వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి 300 మందికి పైగా వైద్యులు, పీజీ విద్యార్థులు, నిపుణులు పాల్గొని శాస్త్రీయ చర్చల్లో పాల్గొన్నారు. ఏపీ ఈఎస్జీకాన్ 2026 నిర్వాహక కమిటీ ప్రతినిధులు డాక్టర్ జవ్వాజి సతీష్, డాక్టర్ గోపీకృష్ణ జాలాది, రాజేష్ బత్తిని, రవిశంకర్ తాతా మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, ఇలాంటి శాస్త్రీయ సదస్సులు వైద్యుల నైపుణ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉంటాయని చెప్పారు. ఆధునిక ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఫలితాలను సమాజానికి ఉపయోగపడేలా మార్చడం వైద్యుల బాధ్యత అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ రెండు రోజుల సదస్సు ద్వారా గ్యాస్ట్రోఎంటరాలజీ రంగంలో తాజా పరిణామాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రమోద్ గార్గ్ చీఫ్ ప్యాట్రన్ గా వ్యవహరిస్తుండగా, డాక్టర్ ఈ. పెదవీర్ రాజు, డాక్టర్ కె. జగన్మోహన్ రావు, డాక్టర్ ఎం. జగన్మోహన్ రావు, డాక్టర్ ఎన్. తిరుమలరావు, డాక్టర్ పి. హరికృష్ణలు ప్యాట్రన్లుగా వ్యవరిస్తున్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ గా డాక్టర్ ఐ. నళినీ ప్రసాద్, డాక్టర్ ఐ.ఆర్.ఎస్. గిరినాథ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సదస్సులో ఐఎస్జీ ఏపీ ఆఫీస్ బేరర్లు డాక్టర్ ఎం. కవిత, డాక్టర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోవుల తరలింపులో మాఫియా ఆగడాలు

- ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా కుట్రతో అల్లరి
- మా అసోసియేషన్ ఏర్పాటు కాకుండా అడ్డుకునేలా ఆరోపణలు
- ప్రభుత్వ ఉద్దేశాలకు తూట్లు పొడుస్తున్న మాఫియా ఆగడాలను అరికట్టాలి
- గోవుల సంత నిర్వాహకులు కాకాని వెంకటేశ్వరరావు**విజయవాడ, ఫిబ్రవరి 13 (**



గోవుల సంతలకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నప్పటికీ.. ఇటీవల కాలంలో అడ్డదారుల్లో దోచుకునే మాఫియా అరాచకాలకు అడ్డేలేకుండా పోతుందని సంతలకు సంబంధించిన యజమాని కాకాని వెంకటేశ్వర రావు ఆవేదన వ్యక్తం చేశారు. బెంజి సర్కిల్ సమీపంలోని ఓ హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి అరాచకాలకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వ నిబంధనలు పాటించేలా అందరం కలిసి అసోసియేషన్ ఏర్పాటుకు తాము ప్రయత్నాలు ప్రారంభిస్తే తమను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ఈ మాఫీయా డాన్ పేరుతో తనపై అభియోగాలు చేశారని, మీడియా ముఖంగా తన తప్పు లేదని చెప్పేందుకే ధైర్యంగా ముందుకు వచ్చానని, ఆరోపణలు చేసిన వారు నిరూపించాలని కాకాని వెంకటేశ్వరరావు సవాల్ చేశారు. కేరళలో పశువులను వధించడం లీగల్ అని, మన ఏపీలో కూడా అనేక ప్రాంతాల్లో పశు మాంసం తీసుకుంటారని గుర్తు చేశారు. విజయవాడలో కబేళా ఎన్నో దశాబ్దాలుగా ఉందని, హైదరాబాదులో పశువులను కోయడం, ఎగుమతి చేయడం లీగల్ గా ఉందని, అయినా పశువులను తరలించడం ఇల్ లీగల్ అని కొంతమంది హడావుడి చేస్తున్నారని చెప్పారు. తమ దగ్గరకు వచ్చిన ప్రతి ఆవుకు లోడింగ్, అన్ లోడింగ్ కు రశీదులు ఇస్తామని, వాటి పోషణకు కూడా ఏర్పాట్లు చేసి పంపిస్తామని, ఇలా 23 సంతల్లో ఎక్కడా ఇల్లీగల్ అనేది లేదని స్పష్టం చేశారు. నారాయణరావు అనే మంచి వ్యక్తి కి ఉన్న సంతను బలవంతంగా తీయించారని, తన సంతను కూడా తొలగించేందుకు విఫలయత్నం చేశారని, ఇది సాధ్యం కాకపోవడంతో.. ఇప్పుడు అసత్యాలు రాయిస్తున్నారని మండిపడ్డారు. హెవీ లోడ్ తో వెళ్లే వాహనాలను ఆపి డబ్బులు దండుకునే ముఠాలు పెరిగాయని, రవాణా శాఖ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది ఈ దోపిడీ లో భాగస్వామ్యం అవుతుండటం బాధ కలిగిస్తుందన్నారు. సంతలకు వెళ్లే పశువులను గోశాలకు తరలించి కేసులు అంటున్నారని, బిజెపి నిర్వహించే గోశాల కు యాభై లక్షలు ఫండ్ ఇచ్చామని, కొంతమంది రోడ్లపై వాహనాలు ఆపి డబ్బు దండుకునే ముఠాలుగా తయారయ్యాయన్నారు. జనవరి 22వ తేదీన హనుమాన్ జంక్షన్ లో రాష్ట్ర వ్యాప్త సమావేశం జరిగిందని ఈ సమావేశం ఏర్పాటు తర్వాత మంచి కొంతమంది తనపై కక్ష పెట్టుకుని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారి అక్రమాలు బయటకి తెస్తే... తనను మాఫీయా లీడర్ అంటున్నారని, దీని పై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు మాఫీయాను అరెస్టు చేయాలని కోరారు. కేరళ, తమిళనాడు విధంగానే ఏపీలో కూడా ఒక అసోసియేషన్ ఏర్పాటు చేస్తామని, త్వరలోనే ఇటువంటి మాఫీయా ఆగడాలను అరి కట్టేలా తనవంతు కృషి చేస్తానని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మాఫియా ఆగడాల పై హోం మంత్రి అనిత కూడా తీవ్రంగా స్పందించారని, దీంతో క్రిమినల్స్ ఇప్పుడు ఏకంగా ఆమెపై కూడా ఒత్తిడి చేస్తున్నట్లు చెప్పారు. నీతిగా ఉన్న హోం మంత్రి పైనా, ప్రభుత్వం పైనా కుట్రలు తో అల్లరి శిక్షించాలని కోరుతున్నారు. చేస్తున్నారని, అటువంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నేడు వారి ఇల్లీగల్ దందాల వల్ల తాను కొన్న వాహనాలు లోపలే పెట్టుకోవాల్సి వచ్చిందని, ఒక పశువుకి రెండు వేలు చొప్పున కట్టాలని రాజేష్ నాయుడు అనే వ్యక్తి దందా చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వల్లే చాలా మంది వాహనాలు నడపలేని పరిస్థితి ఉందని, ఏడేళ్ళ ల్లో 25లక్షల పశువులను చంపేశారన్నారు. ఫ్యాక్టరీ లు వచ్చాక అందరూ అక్కడికే తరలిస్తున్నారని, వాళ్లు వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారని, ఇప్పుడు 23 సంతల్లో 18 సంతల్లో వ్యాపారం లేదని తెలిపారు. గోశాలకు తరలించిన గోవులను గోశాల యజమానులు అక్రమంగా అమ్ముకొని లక్షల్లో సంపాదిస్తున్నారని ఆయన ఆరోపించారు.. మళ్లీ హైదరాబాద్ లో స్క్రీన్ పెట్టి మరిన్ని వాస్తవాలు వెల్లడిస్తామని, పశువుల సంతలు పేరుతో సాగిస్తున్న దందాలను వివరిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు. నక్కపల్లి నియోజకవర్గం టీడీపీ నాయకులు రవిరాజు ఈ పరిశ్రమలో బాధితులు,కార్మికులకు,ప్రమాదానికి గురై అంగవైకల్యం కు గురైన వారికి ఆయన తన సొంత డబ్బుతో సాయం చేస్తూ కాకాని బాబు ను కూడా వారిని ఆదుకునే విధముగా సమావేశం పెట్టి ఒప్పించారు. అందరికీ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించినప్పటికీ.. దందాలతో సంబంధం లేని వ్యక్తులను కూడా లాగి అభాసుపాలు చేశారని, అటువంటి మాఫియాను కఠినంగా

# అమెరికా వీసా నిబంధనలలో మార్పులు

- విద్యార్థి వీసాలలో 50 శాతం కోత
- ప్రత్యామ్నాయంగా ఈబీ-5 మార్గం
- అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ అటార్నీ నడదూర్ ఎస్ కుమార్



విజయవాడ, ఫిబ్రవరి 13

అమెరికా వీసా నిబంధనలలో పెను మార్పులు సంభవించాయని అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ అటార్నీ నడదూర్ ఎస్ కుమార్ తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని వివంతా హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భారతీయ విద్యార్థులకు జారీ చేసే ఎఫ్-1 వీసాల్లో 50 శాతం తగ్గుదల నమోదైందన్నారు. హెచ్-1బీ వీసా నిబంధనల్లో వచ్చిన మార్పులు, పెరిగిన ఫీజులు, గ్రీన్ కార్డ్ కోసం వేచి చూడాల్సిన సుదీర్ఘ కాలం దృష్ట్యా, భారతీయులకు 'ఈబీ-5 ఇన్వెస్టర్ ప్రోగ్రామ్' ఒక సురక్షితమైన, వేగవంతమైన ప్రత్యామ్నాయంగా మారిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక చర్చల్లో ఇమ్మిగ్రేషన్ ప్రధానాంశంగా ఉందన్నారు. దీనివల్ల భారత్ గణనీయంగా ప్రభావితమవుతోందన్నారు. విద్యార్థి, పని వీసాల నుంచి గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్‌ల వరకు భారతీయ దరఖాస్తుదారులు మునుపెన్నడూ లేని విధంగా కఠినమైన తనిఖీలను, జాప్యాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందుకే ఈబీ-5 ఇన్వెస్టర్ ప్రోగ్రామ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అర్థం చేసుకోవడం ఎంతో కీలకమన్నారు. విద్యార్థి వీసాల తగ్గుదల, హెచ్-1బీ నిబంధనల్లో మార్పులు, కఠినమైన కాన్సులర్ తనిఖీల కారణంగా ఈ ఏడాది ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు 50 శాతం తగ్గాయన్నారు. విద్యార్థులు కేవలం గుర్తింపు పొందిన విద్యా సంస్థలకే దరఖాస్తు చేసుకోవాలని, రికార్డులు ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, చిన్నపాటి దొంగతనాలు, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం వంటి చిన్న పొరపాట్లు కూడా ఇప్పుడు వీసా నిరాకరణకు దారితీస్తాయని హెచ్చరించారు. అమెరికాలో ఉండి ఈబీ-5 కి దరఖాస్తు చేసుకునే వారు కాన్సులేట్ సందర్శన అవసరం లేకుండానే ఐదు నెలల్లోపు వర్క్ ఆథరైజేషన్ పొందవచ్చని వివరించారు. ఎటువంటి కోటాలు లేని ఎల్-1 ఇంట్రా-కంపెనీ ట్రాన్స్‌ఫర్ వీసాలు అమెరికాలో వ్యాపారాలు ప్రారంభించాలనుకునే టెక్స్‌టైల్ ఎగుమతిదారులకు ఒక గొప్ప అవకాశమన్నారు. హెచ్-1బీ వీసాల్లో కీలక మార్పులు వచ్చాయన్నారు. అమెరికా వెలుపల ఉన్న కాన్సులేట్‌లలో వీసా పొందేందుకు ఎంప్లాయర్స్ లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అమెరికాలో ఉండి స్టేటస్ మార్చుకునే వారికి ఇది వర్తించదన్నారు. ఉన్నత విద్య, ఎక్కువ వేతనం ఉన్న వారికే ప్రాధాన్యత ఇచ్చేలా వెయిటెడ్ లాటరీ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. మొత్తం హెచ్-1బీ వీసాలలో 70 శాతం భారతీయులకే లభిస్తున్నప్పటికీ, గ్రీన్ కార్డ్ కోసం 10 నుంచి 20 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ నిపుణులను అనిశ్చితిలో పడేస్తోందని పేర్కొన్నారు. ?ఎటువంటి కోటాలు లేని ఎల్-1 ఇంట్రా-కంపెనీ ట్రాన్స్‌ఫర్ వీసాలు స్థిరమైన మార్గాలని సూచించారు. ముఖ్యంగా అమెరికాలో కార్యకలాపాలు ప్రారంభించాలనుకునే టెక్స్‌టైల్ ఎగుమతిదారులకు ఇది గొప్ప అవకాశమన్నారు. ఈబీ-5 ఇన్వెస్టర్ ప్రోగ్రామ్ శాశ్వత నివాసానికి సులభతరమైన మార్గమన్నారు. శాశ్వత నివాసం పొందాలనుకునే వారికి ఇది అత్యంత ఆచరణాత్మకమైన మార్గమన్నారు. టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియాల్లో (టీఈఏ) ఉన్న రీజినల్ సెంటర్లలో 800,000 డాలర్ల పెట్టుబడి పెట్టడం ద్వారా గ్రీన్ కార్డ్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో ఉద్యోగ కల్పన బాధ్యతను యూఎస్సీఐఎస్ గుర్తింపు పొందిన సెంటర్లే చూసుకుంటాయన్నారు. 30 ఏళ్ల అనుభవంతో వేల సంఖ్యలో ఈబీ-5 కేసులను ఫైల్ చేశానన్నారు. నా దగ్గర దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ గ్రీన్ కార్డ్ వచ్చిందన్నారు. 4-6 ఏళ్లలో వారి పెట్టుబడి తిరిగి లభించిందన్నారు. ఒక్క కేసు కూడా తిరస్కరణకు గురి కాలేదన్నారు. అమెరికాలో ఉన్న ఈబీ-5 దరఖాస్తుదారులు ఐదు నెలల్లోనే పని చేయడానికి అనుమతి పొందవచ్చని, కాన్సులేట్ సందర్శనల అవసరం ఉండదని పేర్కొన్నారు. పెట్టుబడి భద్రత తమ ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. నడదూర్ ఎస్ కుమార్ కు అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టాలపై 40 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. గతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యూఎస్సీ (యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా), యూసీఎల్ఏ (యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజిల్స్)లలో 'డీన్ ఆఫ్ ఫారిన్ స్టూడెంట్స్'గా పనిచేశారు. ?లా ఆఫీసెస్ ఆఫ్ నడదూర్ ఎస్ కుమార్ ఈ సంస్థ 1993లో స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయం లాస్ ఏంజిల్స్లో ఉంది. వీరు కేవలం ఉద్యోగ వీసాలే కాకుండా.. కుటుంబ ఆధారిత పిటిషన్లు ఇతర క్లిష్టమైన కేసులను కూడా డీల్ చేస్తారు.

---

AXIS MAX LIFE INSURANCE

# ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026కు భారీ భాగస్వామ్యం

- స్టార్ స్పోర్ట్స్ 'అముల్ క్రికెట్ లైవ్'తో అసోసియేట్ పార్ట్‌నర్‌గా యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్


వైజాగ్, ఫిబ్రవరి 13

గతంలో మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌గా పిలువబడే యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (యాక్సిస్ మాక్స్ లైఫ్/కంపెనీ) భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 కోసం స్టార్ స్పోర్ట్స్ 'అముల్ క్రికెట్ లైవ్'తో అసోసియేట్ పార్ట్‌నర్‌గా చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి, క్రికెట్, సినీ రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన ఒక సినిమాటిక్ యాడ్ సిరీస్‌ను బ్రాండ్ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా యాక్సిస్ మాక్స్ లైఫ్ డైరెక్టర్ & చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాహుల్ తల్వార్ మాట్లాడుతూ ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 కోసం స్టార్ స్పోర్ట్స్‌తో మా భాగస్వామ్యం, క్రీడలు, సంస్కృతి కలిసే చోట మా 'భరోసా' సందేశాన్ని బలంగా నిలబెడుతుందని తెలిపారు. మాకు క్రికెట్ అనేది కేవలం ప్రేక్షకులను చేరుకునే మార్గం మాత్రమే కాదని, పనితీరు, రక్షణ, వారసత్వం వంటి అంశాలపై చర్చలు జరిపే ఒక శక్తివంతమైన వేదిక అన్నారు. రోహిత్-రితికా ప్రపంచంలోకి అల్లు శిరీష్‌ను తీసుకురావడం ద్వారా సినిమా గ్లామర్‌ను, క్రికెట్ పట్ల ఉన్న మక్కువను ఒకటి చేశామన్నారు. దీనివల్ల ఆర్థిక రక్షణ అనేది ప్రతి ఒక్కరి జీవిత దశలకు చేరువవుతుందన్నారు. ఈ ప్రపంచ వేదికపై కేవలం వాగ్దానాలకే పరిమితం కాకుండా, ఆచరణ ద్వారా నమ్మకాన్ని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. తద్వారా భారతీయ కుటుంబాలలో ఆర్థిక భద్రత అనేది ఒక ప్రాధాన్యతగా మారుతుందన్నారు. క్రికెట్‌కు ఉన్న తిరుగులేని సార్వత్రిక ఆదరణతో, ఈ భాగస్వామ్యం మా 'భరోసా తుమ్ హో' బ్రాండ్ ప్రచారాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జియోస్టార్ స్పోర్ట్స్ సేల్స్ హెడ్ అనూప్ గోవిందన్ మాట్లాడుతూ యాక్సిస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ మాతో చేతులు కలపడం అనేది కేవలం ప్రకటనల కోసం మాత్రమే కాకుండా, ఫలితాలకు ప్రాధాన్యత ఇచ్చే దీర్ఘకాలిక భాగస్వామ్యాల వైపు మారుతున్న ధోరణిని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 కోసం, జియోస్టార్ భారీ స్థాయిలో ప్రేక్షకులను కనెక్ట్ చేస్తుందన్నారు. ఇది యాక్సిస్ మాక్స్ లైఫ్ తన బ్రాండ్ సందేశాన్ని బలంగా వినిపించడానికి, వ్యాపార లక్ష్యాలను చేరుకోవడానికి, ప్రజలతో ఒక బలమైన భావోద్వేగ బంధాన్ని ఏర్పరచుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ క్రికెట్ సమరంలో మ్యాచ్‌కు ముందు జరిగే చర్చలు, విశ్లేషణల ద్వారా బ్రాండ్‌కు విశేషమైన గుర్తింపు లభించనుంది. ఈ టోర్నమెంట్‌కు ఉన్న భారీ గ్లోబల్ వ్యూయర్‌షిప్‌ను ఉపయోగించుకోవడం ద్వారా యాక్సిస్ మాక్స్ లైఫ్ తన 'భరోసా' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆర్థిక రక్షణను ప్రతి ఇంట్లో ఒక భాగంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్రికెట్ క్రీడలో ఉండే 'రిస్క్ మేనేజ్‌మెంట్', 'దీర్ఘకాలిక వ్యూహాలు' ఇన్సూరెన్స్ రంగానికి ప్రతిబింబంగా ఉంటాయని భావిస్తున్న కంపెనీ సంక్లిష్టమైన ఆర్థిక ప్రణాళికను క్రీడల ద్వారా వినియోగదారులకు సులభంగా అర్థమయ్యేలా వివరించడానికి ఈ వేదికను ప్రాథమిక ప్లాట్‌ఫారమ్‌గా ఎంచుకుంది. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి, క్రికెట్, సినీ రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన ఒక సినిమాటిక్ యాడ్ సిరీస్‌ను బ్రాండ్ ఆవిష్కరించింది. ఈ సృజనాత్మక వ్యూహం సంప్రదాయ 'సంపాదకుడి' పాత్ర నుంచి ఆధునిక, సానుభూతితో కూడిన 'సంరక్షకుడి' పాత్రకు మారుతూ రూపొందించబడింది. ఇందులో రోహిత్ శర్మ తన భార్య రితికా సజ్దేతో కలిసి ఒక కొత్త తరం తండ్రిగా, కుటుంబ సంరక్షకుడిగా కనిపిస్తారు. ఈ ప్రకటనలలో ఒక సరికొత్త సాంస్కృతిక కలయికగా, సౌత్ ఇండియన్ స్టార్ అల్లు శిరీష్ వారితో జతకట్టారు. ఇది సినీ గ్లామర్‌ను వరల్డ్ కప్ ఉత్సాహంతో మిళితం చేస్తుంది. ఈ లఘు చిత్రాలు ఆర్థిక రక్షణ గురించి చర్చను వినోదాత్మకంగా, అందరికీ అర్థమయ్యేలా మారుస్తూ, ఇన్సూరెన్స్ అనే భావనను ఒక ఆశయంగా మార్చాయి.

---

# సహకార శక్తితో గ్రామీణాభివృద్ధికి బలమైన అడుగు




- జగ్గయ్యపేట మండలంలో రూ.3.90 కోట్ల కేడీసీసీ రుణాల ఘన పంపిణీ
- డ్వాక్రా సంఘాలకు సగం రుణాలు.. మహిళా సాధికారతకు పెద్దపీట

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 13 )

జగ్గయ్యపేట మండల పరిధిలోని కృష్ణ ఫార్మర్ సొసైటీలో Krishna District Cooperative Central Bank (కేడీసీసీ బ్యాంక్) ఆర్థిక సహకారంతో బండిపాలెం, గౌరవరం, పోచంపల్లి, మంగోలు, గోపాలకృష్ణ సొసైటీల పరిధిలోని డ్వాక్రా మహిళా సంఘాలు మరియు రైతులకు "రైతు నేస్తం- కర్షక మిత్ర" రుణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మొత్తం రూ.3.90 కోట్ల విలువైన రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో సగం రుణాలు డ్వాక్రా మహిళా సంఘాలకు మంజూరు చేయడం విశేషం. మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి విస్తరణ, కుటుంబాల ఆర్థిక స్థిరత్వం లక్ష్యంగా ఈ రుణాలు మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) హాజరై లబ్ధిదారులకు రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ, కేడీసీసీ బ్యాంక్ రైతు-మహిళా సంక్షేమానికి అంకిత భావంతో పనిచేస్తోందని చెప్పారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతం అయితేనే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాలకు సగం రుణాలు మంజూరు చేయడం మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ, రైతులు మరియు మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడితేనే గ్రామీణ సమాజం సుసంపన్నంగా మారుతుందని తెలిపారు. రైతు నేస్తం, కర్షక మిత్ర పథకాల ద్వారా సాగు వ్యయభారం తగ్గి, పంటల ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ మాట్లాడుతూ, నెట్టెం రఘురాం నాయకత్వంలో కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ సహకార రంగానికి కొత్త ఊపు వచ్చిందన్నారు. మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడంలో ఈ రుణాలు కీలకమవుతున్నాయని చెప్పారు. గౌరవరం సొసైటీ ప్రెసిడెంట్ కట్టా వెంకట నరసింహారావు, పోచంపల్లి సొసైటీ అధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కృష్ణ సొసైటీ ప్రెసిడెంట్ యానాల గోపీచంద్, మంగోలు సొసైటీ ప్రెసిడెంట్ బొల్లం పురుషోత్తం, గోపాలకృష్ణ సొసైటీ ప్రెసిడెంట్ ధూళిపాళ లక్ష్మణరావు, బండిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ బొల్లినేని అప్పారావు తదితరులు మాట్లాడుతూ, తక్కువ వడ్డీ రుణాలు రైతులు మరియు మహిళా సంఘాలకు ఎంతో మేలు చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కౌన్సిలర్ గీతారాణి మాట్లాడుతూ, డ్వాక్రా మహిళలకు అందుతున్న రుణాలు కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారులు కేడీసీసీ బ్యాంక్ మరియు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ రుణాలు తమ ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని ఆనందం వ్యక్తం చేశారు.

---

# సంపాదకీయం




## కుల వివక్షను కాపాడుతున్న పాలక వ్యవస్థ

**యుగయుగాలుగా భారతీయ సమాజాన్ని వేధిస్తున్న జాడ్యాన్ని కొంతైనా పరిష్కరించడం కోసం, ఉన్నత విద్యా రంగంలో దాని ప్రభావాన్ని తగ్గించేందుకోసం తీసుకొచ్చిన ఒక పాక్షిక చర్య- అందుకోసం సరికొత్త నిబంధనలు-వాటిపై భీకరమైన కుట్రపూరిత ప్రతికూలత-ఆ పైన ఒక ఆర్భాటానికి మీడియా ఇచ్చిన ఊపు! ఒక హంగామా. దాంతో ఆ చర్యలకు విఘాతం. అసలు ఆ ఆలోచనే వెనక్కు వెళ్లిపోవడం. ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్షను ఎదుర్కొనేందుకు తీసుకొచ్చిన నూతన యుజిసి నిబంధనల వారం రోజుల కథను ఇలా వర్ణించవచ్చు.**

సుప్రీంకోర్టు ఈ నిబంధనలను జనవరి 29న నిలిపేసింది. మరో తేదీన వినాలని వాయిదా వేసింది. అప్పటి వరకూ 2012 నాటి నిబంధనలే కొనసాగించాలని ఆదేశించింది. ఈ నూతన నిబంధనలకు అనేక పరిమితులున్నాయి. అయినా ఉన్నత కులాల విద్యార్థులు, బిజెపి లోని కొన్ని శక్తులతో సహా పార్టీలు గగ్గోలు పెట్టిన తర్వాతనే అత్యున్నత న్యాయస్థానం రంగ ప్రవేశం చేసింది. మీడియా అయితే దీనిపై ఉన్మాద పూరితమైన ప్రచారం నడిపించింది. ఇంత వేగంగా ప్రతిస్పందన రావడం, వరుసగా ఘటనలు జరగడంబట్టి చూస్తే ఇదంతా ఒక పథకం ప్రకారం జరిగిన నాటకమేనని చాలా మంది భావించవలసి వచ్చింది. బిజెపి నుంచి బిఎస్‌పి వరకూ రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడ్డాయి. మొదట నూతన నిబంధనలను అన్యమనస్కంగానే ఆహ్వానించాయి. తర్వాత కోర్టు ఇచ్చిన స్టేనూ ఇవి హర్షించాయి. ఆ స్టేతో కులీన వర్గాల ఆందోళన సద్దుమణిగింది. అన్నీ యథాతథంగా మామూలు స్థితికి చేరాయి. యుజిసి 2026 జనవరి 11న కొత్త నిబంధనలను ప్రకటించింది. అంతకు ముందు సుదీర్ఘమైన సంప్రదింపుల ప్రక్రియ కొంతవరకూ సుప్రీంకోర్టు అజమాయిషీలో కూడా జరిగింది. ఉన్నత విద్యాసంస్థల్లో సాగే తీవ్రమైన కుల వివక్షను అరికట్టడంలో అదివరకున్న 2012 నిబంధనలు విఫలమైనాయి గనక వాటి స్థానంలో ఈ నూతన నిబంధనలు తేవాలన్నది ఉద్దేశం. రోజువారీ వేధింపులు దుర్భాషలతో పాటు శారీరకంగా హింసించడం కూడా ఆ దారుణ వివక్షలో భాగంగా వుంటుందని గుర్తు చేయవలసి వుంటుంది. 2016లో రోహిత్ వేముల, 2019లో పాయల్ తాడ్వి ఆత్మహత్యలు వేళ్లానుకుపోయిన ఈ దారుణ జాడ్యానికి సాక్ష్యాలుగా నిలిచాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఉన్నత విద్యాసంస్థలలో 2014-21 మధ్య 24 మంది ఎస్సి, ముగ్గురు ఎస్టి, 41 మంది ఒబిసి వర్గాల విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2021లో పార్లమెంటులో చెప్పారు. ఐఐటిలు, ఐఐఎంలు, నిట్‌లు వివిధ వైద్య కళాశాలలు ఈ జాబితాలో వున్నాయి. రాష్ట్రాలు నడిపే విశ్వవిద్యాలయాలు, ఇంకా ఇతర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేవు. బహుశా ఆ సంఖ్య కూడా దిగ్భ్రాంతికరంగానే వుండొచ్చు. గత అయిదేళ్లలో విశ్వవిద్యాలయాల్లో వివక్షా ఘటనలు 118.4 శాతం పెరిగాయని యుజిసినే సుప్రీంకోర్టు ముందు ఇచ్చిన నివేదికలో అంగీకరించింది కనుక 2012 నాటి నిబంధనలు ఏ మేరకు గట్టిగా పని చేశాయన్నది దీన్నిబట్టే తెలుస్తుంది. సంవత్సరానికి 200 కంటే తక్కువ నుంచి దాదాపు 400కు పెరిగాయి. ఉన్నత విద్యాసంస్థల్లో పాతుకుపోయిన దురభిప్రాయాలు ముఖ్యంగా ఐఐటి, ఐఐఎం వంటి ఉన్నత స్థాయి సంస్థల్లో మరింత పెరుగుతాయని విశ్లేషకులు అనేకమంది చెప్పారు. 2020 డిసెంబర్‌లో విద్యా మంత్రిత్వశాఖ నియమించిన ఎనిమిది మంది ఐఐటి డైరెక్టర్ల కమిటీ ఐఐటిలలో రిజర్వేషన్లు ఎత్తివేయాలని సిఫార్సు చేయడం ఇందుకో మచ్చుతునక. అవి జాతీయ స్థాయి పరిశోధనా సంస్థలు గనక వాటిలో రిజర్వేషన్లు వుండకూడదని ఆ కమిటీ పేర్కొంది. డైరెక్టర్లే ఎస్.సి/ఎస్.టి/బి.సి విద్యార్థులు పరిశోధన చేయలేనివారని భావించిందంటే ఇక ఉన్నతాధికార బృందాలు /విద్యార్థులు/ అధ్యాపకులు ఎలా ఆలోచిస్తారో ఎవరైనా ఊహించుకోవచ్చు. వ్యవస్థాగతంగా ఈ మొగ్గు ఎలా వుంటుందో చెప్పే మరో ఉదాహరణ చూద్దాం. 45 కేంద్ర విశ్వవిద్యాలయాలలో ఒక్క ఎస్సి వైస్‌ఛాన్సలర్ మాత్రమే వున్నట్టు 2021లో విద్యా మంత్రిత్వ శాఖ లోక్‌సభకు తెలియజేసింది. కేంద్ర సంస్థలలో ఎస్.సి లకు 15 శాతం, ఎస్.టి లకు 7.5 శాతం, ఒ.బి.సి లకు 27 శాతం, ఇ.బి.సి లకు 10 శాతం రిజర్వేషన్లు వుండాలనేది రాజ్యాంగ నిర్దేశమని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఎస్.సి, ఎస్.టి, ఓ.బి.సి కులాలతో పాటు ముస్లింల వంటి ఉపేక్షిత వర్గాలకు చెందిన విద్యార్థులపై రోజువారీగా సాగే నిర్విరామ వివక్షతకు గురయ్యేవారి సంఖ్య పెరుగుతున్నది. దాంతో విద్యాసంస్థలలో స్వేచ్ఛాయుత అనుభవంగా వుండవలసింది పోయి మనుగడ దుర్భరంగా తయారవుతున్నది. ఆ పరిస్థితిని చక్కదిద్దే పాలనా చర్యల కోసమే యుజిసి నూతన నిబంధనలు అవసరమైనాయి. మరీ ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు, తెగలు, విద్యాపరంగా ఆర్థికంగా వెనకబడిన తరగతులకు చెందిన వారు, అంగవైకల్యం వున్నవారు వీటిలో ఏదైనా ఒక తరగతికి చెందిన వారిపై కేవలం మతం, కులం, జాతి, లింగం, జన్మస్థలం, శారీరక లోపం వంటి వాటిని బట్టి సాగే వివక్షను అంతమొందించడం యుజిసి నూతన నిబంధనల లక్ష్యంగా పేర్కొనబడింది. 2012 నాటి నిబంధనల స్థానంలో ఈ కొత్తవీ తీసుకురావడం అందుకే. యుజిసి పరిధిలోకి వచ్చే అన్ని విద్యాసంస్థలకూ ఈ కొత్త ఉత్తర్వులు వర్తిస్తాయి. ఐఐటిలు, ఐఐఎంల వంటి వాటిని వదిలేయడం అందుకోసమే. ఈ నిబంధనల ప్రకారం ప్రతి సంస్థలోనూ సమాన అవకాశాల కేంద్రాలు, సమతా కేంద్రాలు, సమతా దళాలు స్థాపించాల్సి వుంది. 2012-2026 నిబంధనల మధ్య అతి పెద్ద తేడా ఏమంటే ఈ దఫా ఓబిసిలను కూడా చేర్చడమే. ఉన్నత కులాలలో నిరసనకు ఇదే కారణమైంది. అంతేగాక 2012 నిబంధనలు సలహా పూర్వకమైనవి తప్ప వాటిని పాటించని సంస్థలపై ఎలాంటి చర్యలు సిఫార్సు చేసే అధికారం కల్పించలేదు. కాని 2026లో వచ్చిన ఈ నిబంధనల ప్రకారం అలాంటి వాటిపై తీవ్ర జరిమానాలు, అసలు నిధుల మంజూరులో యుజిసి పరిధి నుంచి తొలగించడం వంటి శిక్షా చర్యలకు అవకాశం కల్పించబడింది. 2012 నిబంధనల ప్రకారం వివక్ష నిరోధ అధికారి నియామకంతో పాటు ఆ అధికారి నిర్ణయాన్ని సంస్థ అధిపతికి నివేదించే అవకాశం కల్పించబడింది. కొత్త నిబంధనల్లో ఆ ప్రక్రియను మరింత విస్తరించడమేగాక వాటిని పరిష్కరించే పద్ధతులు కూడా రూపొందించబడ్డాయి. అయితే ఉన్నత కులాల విద్యార్థుల ఆందోళనలతో అది ఏకీభవించి స్టే ఇచ్చినట్టు కనిపిస్తుంది. ఈ అమానుష పద్ధతులను అరికట్టేందుకు తీసుకునే చర్యల వల్ల విభజన మరింత తీవ్రం కావడం జరగదు. ఇది చాతుర్వర్ణ వ్యవస్థను కాపాడాలనే ఆరెస్సెస్, బిజెపి వాటి వత్తాసుదార్లు దశాబ్దాలుగా వినిపిస్తున్న వికృత తర్కం మాత్రమే. హిందూ సమాజంలో వివిధ తరగతుల మధ్య సమరసత (కచ్చితంగా చెప్పాలంటే నిరావేశం, సౌహార్ద్రత) అంతకంతకూ ఎక్కువగా ఆరెస్సెస్ చెబుతూ వస్తున్నది. వివక్షకు పాల్పడిన వారిపై ఎలాంటి శిక్షలు విధించే చర్యలు వుండరాదని ఆరెస్సెస్ గట్టిగా వాదిస్తున్నది.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# టీ20 ప్రపంచకప్‌లో సంచలనం..

## ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించిన జింబాబ్వే..

**టి20 ప్రపంచ కప్ లో భాగంగా జరుగుతున్న 19వ మ్యాచ్ లో జింబాబ్వే ఆస్ట్రేలియాకు 170 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. కానీ, ఈ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా చేరుకోవడంలో విఫలమైంది. కేవలం 19. 3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో జింబాబ్వే 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. జింబాబ్వే 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది.**




జింబాబ్వే ఆస్ట్రేలియాను 23 పరుగుల తేడాతో ఓడించింది. టీ20 ప్రపంచ కప్‌లోని 19వ మ్యాచ్‌లో జింబాబ్వే ఆస్ట్రేలియాకు 170 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బౌలింగ్ చేయాలని ఆస్ట్రేలియా నిర్ణయించుకుంది. జింబాబ్వే 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా 19.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది.

మాట్ రెన్షా (65), మార్కస్ స్టోయినిస్ (6), గ్లెన్ మాక్స్వెల్ (31), ట్రావిస్ హెడ్ (17), జోష్ ఇంగ్లిస్ (8) అందరూ అవుట్ కాగా, టిమ్ డేవిడ్, కామెరాన్ గ్రీన్ తమ ఖాతాలను తెరవడంలో విఫలమయ్యారు.

జింబాబ్వే తరఫున బ్రియాన్ బెన్నెట్ 56 బంతుల్లో అజేయంగా 64 పరుగులు చేశాడు. ఇది టి20 ప్రపంచ కప్‌లో అతని తొలి అర్ధ సెంచరీ మరియు టి20 అంతర్జాతీయాల్లో అతని మొత్తం 11వది. తడివానాషే మరుమాని మరియు ర్యాన్ బర్ల్ కూడా తలా 35 పరుగులు చేశారు. కెప్టెన్ సికందర్ రజా 13 బంతుల్లో అజేయంగా 25 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా తరఫున మార్కస్ స్టోయినిస్ మరియు కామెరాన్ గ్రీన్ తలా ఒక వికెట్ తీసుకున్నారు.

ఈ మ్యాచ్ సమయంలో ఆస్ట్రేలియా కూడా గాయాల బారిన పడే అవకాశం ఉంది. బంతిని ఆపడానికి ప్రయత్నించినప్పుడు చేతికి గాయమైన మార్కస్ స్టోయినిస్ మ్యాచ్ మధ్యలో మైదానం నుంచి నిష్క్రమించాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయం కారణంగా ఆడటం లేదు. అతను మునుపటి మ్యాచ్ కు కూడా దూరమయ్యాడు. ట్రావిస్ హెడ్ లేనప్పుడు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు.

### రెండు జట్ల ప్లేయింగ్-11

ఆస్ట్రేలియా: ట్రావిస్ హెడ్ (కెప్టెన్), జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), కామెరాన్ గ్రీన్, మాట్ రెన్షా, గ్లెన్ మాక్స్వెల్, టిమ్ డేవిడ్, మార్కస్ స్టోయినిస్, నాథన్ ఎల్లిస్, బెన్ డ్వార్షుయిస్, మాథ్యూ కుహ్నెమాన్, ఆడమ్ జంపా.

జింబాబ్వే: సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, తడివానాషే మారుమణి, డియోన్ మైయర్స్, ర్యాన్ బర్ల్, తషింగా ముసెకివా, బ్రాడ్లీ ఎవాన్స్, వెల్లింగ్టన్ మసకద్జా, బ్లెస్సింగ్ ముజరబానీ, టోనీ మునియోంగా, గ్రేమ్ క్రీమర్.

# సిక్సర్ల సునామీ..ఒకే ఓవర్‌లో 28 పరుగులు..

## రోహిత్ రికార్డు సమం చేసిన ఇషాన్

**టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా కుర్రాడు ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఈ వికెట్ కీపర్ బ్యాటర్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. స్టేడియం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడుతూ నమీబియా బౌలర్లకు చుక్కలు చూపించాడు.**




టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా కుర్రాడు ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఈ వికెట్ కీపర్ బ్యాటర్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. స్టేడియం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడుతూ నమీబియా బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కును అందుకున్న ఇషాన్, ఓవరాల్‌గా 24 బంతుల్లో 61 పరుగులు చేసి భారత్‌కు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో హైలైట్ ఏదైనా ఉందంటే అది పవర్‌ప్లే చివరి ఓవరే. నమీబియా బౌలర్ జేజే స్మిత్ వేసిన ఆ ఓవర్‌లో ఇషాన్ కిషన్ పూనకం వచ్చినట్లు ఆడాడు. మొదటి బంతి డాట్ అయినప్పటికీ, ఆ తర్వాత వరుసగా నాలుగు బంతులను సిక్సర్లుగా మలిచాడు. చివరి బంతికి ఫోర్ కొట్టి మొత్తం ఆ ఓవర్‌లో 28 పరుగులు పిండుకున్నాడు. దీనితో టీ20 ప్రపంచకప్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో భారతీయ బ్యాటర్‌గా రోహిత్ శర్మ (2024 వరల్డ్ కప్) రికార్డును ఇషాన్ సమం చేశాడు. ఈ జాబితాలో 36 పరుగులతో యువరాజ్ సింగ్ (2007) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో 250 పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. కేవలం 20 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేసుకున్న అతను, మొత్తం ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. ఓపెనర్‌గా వచ్చి పవర్‌ప్లేలోనే జట్టు స్కోరును వందకు చేరువ చేయడం వల్ల భారత్‌కు తిరుగులేని ఆధిపత్యం లభించింది. పవర్‌ప్లేను ఎలా వాడుకోవాలో ఇషాన్ తన ఇన్నింగ్స్ ద్వారా మరోసారి ప్రపంచానికి చాటి చెప్పాడు.

నిజానికి ఇషాన్ కిషన్ గత కొంతకాలంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. క్రమశిక్షణ చర్యలు, ఫామ్ లేమి వంటి కారణాలతో సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టారు. అయితే పట్టువదలని విక్రమార్కుడిలా దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించి మళ్లీ నేషనల్ టీంలోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో సెంచరీ బాది ఫామ్‌లోకి వచ్చిన ఇషాన్, ఇప్పుడు వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలో సత్తా చాటడం విశేషం. టీమిండియా టాప్ ఆర్డర్‌లో ఇలాంటి అగ్రెసివ్ బ్యాటర్ ఉండటం జట్టుకు కొండంత బలాన్నిస్తోంది. సూపర్ 8 దిశగా సాగుతున్న భారత్‌కు ఇషాన్ ఫామ్ చాలా ముఖ్యం. నమీబియా వంటి చిన్న జట్లపైనే కాకుండా పెద్ద జట్లపై కూడా ఇలాగే ఆడితే భారత్ రెండోసారి టీ20 కప్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో యంగ్ ఇండియా పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇషాన్ లాంటి ఆటగాళ్లు క్లిక్ అయితే ప్రత్యర్థి ఎవరైనా సరే వణకాల్సిందే.

# ప్రపంచకప్‌లో భారత్-పాక్ సమరం..

## రికార్డుల రారాజు టీమిండియాను పాక్ అడ్డుకోగలదా?




**ప్రపంచ క్రికెట్‌లో దేనికైనా సాటిరాని అద్భుతం.. భారత్-పాకిస్థాన్ మ్యాచ్. ఆ రోజు రెండు దేశాల్లోనూ రోడ్లు ఖాళీ అవుతాయి, టీవీల ముందు కోట్లాది మంది ఫ్యాన్స్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కూర్చుంటారు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఈ మహా సంగ్రామం ఫిబ్రవరి 15న శ్రీలంక వేదికగా జరగనుంది.**

ప్రపంచ క్రికెట్‌లో దేనికైనా సాటిరాని అద్భుతం.. భారత్-పాకిస్థాన్ మ్యాచ్. ఆ రోజు రెండు దేశాల్లోనూ రోడ్లు ఖాళీ అవుతాయి, టీవీల ముందు కోట్లాది మంది ఫ్యాన్స్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కూర్చుంటారు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఈ మహా సంగ్రామం ఫిబ్రవరి 15న శ్రీలంక వేదికగా జరగనుంది. ఇప్పటికే గ్రూప్-ఎ లో తమ తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదున్న ఈ రెండు జట్లు, ఇప్పుడు అధికారిక పోరు కోసం సిద్ధమవుతున్నాయి. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది.

### శ్రీలంకలో మ్యాచ్ ఎందుకు?

టీ20 ప్రపంచకప్ 2026కి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. అయితే భద్రతా కారణాల దృష్ట్యా పాకిస్థాన్ తన గ్రూప్ మ్యాచ్‌లను శ్రీలంకలోనే ఆడుతోంది. టీమిండియా3 తన తొలి రెండు మ్యాచ్‌లను (యుఎస్ఏ, నమీబియాపై) భారత్‌లో ఆడి తిరుగులేని విజయాలను అందుకుంది. ఇప్పుడు పాకిస్థాన్‌తో తలపడడానికి భారత జట్టు శ్రీలంకకు చేరుకుంది. దాయాది జట్లు రెండు కూడా ఇప్పటికే రెండేసి విజయాలతో 4 పాయింట్లతో ఉండటం వల్ల, ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా సూపర్ 8 రౌండ్‌కు క్వాలిఫై అవుతుంది.

### హెడ్-టు-హెడ్ రికార్డులు

టీ20 ప్రపంచకప్ చరిత్రలో పాకిస్థాన్‌పై టీమిండియాదే పూర్తి ఆధిపత్యం. ఇప్పటివరకు ఈ మెగా టోర్నీలో రెండు జట్లు 8 సార్లు ముఖాముఖి తలపడగా.. భారత్ ఏకంగా 7 సార్లు విజయం సాధించింది. పాకిస్థాన్ కేవలం ఒక్కసారి (2021లో) మాత్రమే గెలవగలిగింది. 2007 ఫైనల్ నుంచి మొన్నటి 2024 వరల్డ్ కప్ వరకు భారత్ నిలకడగా రాణిస్తూ వస్తోంది. ఈ గణాంకాలు చూస్తుంటే ఫిబ్రవరి 15న కూడా భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుందని స్పష్టమవుతోంది.

### పిచ్ రిపోర్ట్, టీమ్ బలం

కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ బంతి కొంచెం నెమ్మదిగా వచ్చే అవకాశం ఉండటంతో మధ్య ఓవర్లలో కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ లేదా వరుణ్ చక్రవర్తి వంటి స్పిన్నర్లు కీలకం కానున్నారు. మరోవైపు పాకిస్థాన్ పేస్ ద్వయం షాహీన్ అఫ్రిది, నసీమ్ షా పవర్‌ప్లేలో వికెట్లు తీయాలని చూస్తారు. అయితే భారత టాప్ ఆర్డర్ ఫామ్‌లో ఉండటం, ముఖ్యంగా సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో జట్టు ఐక్యంగా ఉండటం భారత్‌కు ప్లస్ పాయింట్.

### షెడ్యూల్, టెలికాస్ట్ వివరాలు

ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ ఫిబ్రవరి 15 (ఆదివారం) నాడు జరుగుతుంది. సాయంత్రం 6:30 గంటలకు టాస్ వేస్తారు. మ్యాచ్ సరిగ్గా రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. టీవీలో చూడాలనుకునే వారు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో, ఆన్‌లైన్‌లో చూడాలనుకునే వారు జియో సినిమా లేదా హాట్‌స్టార్ యాప్స్ లో లైవ్ వీక్షించవచ్చు.

# అదంతా అప్పుడండి..

## ఇప్పుడు నేను మారిపోయాను: ఇషాన్ కిషన్

**పాట్టి ప్రపంచకప్‌లో భాగంగా ఈనెల 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అందరి చూపు విచిత్రమైన యాక్షన్‌తో బౌలింగ్ చేస్తున్న ఉస్మాన్ తారిక్‌పైనే ఉంది. అయితే అతడిని ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని టీమ్ఇండియా బ్యాటర్ ఇషాన్ కిషన్ అన్నాడు. నమీబియాతో మ్యాచ్ అనంతరం అతడు విలేకర్లతో మాట్లాడాడు.**

'మేం ఇప్పటికే అతడి (ఉస్మాన్ తారిక్) బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. మేం బంతిని చూస్తూ.. మా సహజసిద్ధమైన ఆటను ఆడాల్సిన సమయం వచ్చింది. మేం స్కోర్‌బోర్డ్ మీద మంచి టోటల్ ఉంచాలనుకుంటున్నాం. కొన్ని వీడియోలు చూడటంతో అతడి బౌలింగ్ మీద మాకో అవగాహన వచ్చింది' అని ఇషాన్ కిషన్ అన్నాడు.

### 'మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది'

న్యూజిలాండ్ సిరీస్ నుంచి తాము ఎంతో నేర్చుకున్నామని, ఆ ప్రదర్శన తమలో ఆత్మవిశ్వాసం నింపిందని ఇషాన్ కిషన్ అన్నాడు. 'పరుగులు సాధించడం బ్యాటర్లకు మంచి విషయం. గత సిరీస్ నుంచి మేం బాగా ఆడుతున్నాం. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచుల నుంచి మేం చాలా నేర్చుకున్నాం. ఆ సిరీస్‌తో మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది' అని ఇషాన్ కిషన్ వివరించాడు.

### హార్దిక్, ఇషాన్ ధనాధన్

'నా ఆట మీద ఎక్కువగా దృష్టి పెడుతున్నాను!'

గతంలో తాను జోక్స్‌తో ఎక్కువ కాలక్షేపం చేసేవాడినని.. ప్రస్తుతం తాను క్రికెట్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తున్నానని ఇషాన్ కిషన్ అన్నాడు. 'నిజం చెప్పాలంటే నేను ఇప్పుడు మారిపోయిన మనిషినని అనుకుంటున్నాను. ఎందుకంటే నాకు జోకులంటే చాలా ఇష్టం. గతంలో నేను 24ఇ7 జోక్స్‌తో కాలక్షేపం చేసేవాడిని. కానీ ఇప్పుడు ఆ సమయాన్ని రెండు, మూడు గంటలకు తగ్గించాను. ప్రస్తుతం బ్యాటింగ్, నా వికెట్ కీపింగ్ మీదే ఎక్కువ దృష్టి పెడుతున్నాను. ఇది జట్టుకు, అలాగే నాకూ ప్రయోజనకరం. క్రికెట్ తర్వాతే ఏదైనా' అని కిషన్ పేర్కొన్నాడు.

# 17 ఏళ్ల నిరీక్షణకు తెరపడుతుందా?

## రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త కెప్టెన్.. 24 ఏళ్ల కుర్రాడికి పట్టాభిషేకం

**ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభానికి ముందే రాజస్థాన్ రాయల్స్ అభిమానులకు ఒక భారీ షాకింగ్ అప్‌డేట్ అందింది. గత కొన్ని ఏళ్లుగా జట్టును నడిపించిన సంజూ శాంసన్ జట్టును వీడటంతో, రాయల్స్ ఫ్రాంచైజీ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది.**

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభానికి ముందే రాజస్థాన్ రాయల్స్ అభిమానులకు ఒక భారీ షాకింగ్ అప్‌డేట్ అందింది. గత కొన్ని ఏళ్లుగా జట్టును నడిపించిన సంజూ శాంసన్ జట్టును వీడటంతో, రాయల్స్ ఫ్రాంచైజీ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. కేవలం 24 ఏళ్ల వయసున్న యువ ఆటగాడిని కెప్టెన్‌గా నియమిస్తూ కొత్త శకానికి నాంది పలికింది. ఇంటర్వ్యూలు, గత సీజన్ ప్రదర్శనల ఆధారంగా మేనేజ్‌మెంట్ ఈ తుది నిర్ణయానికి వచ్చింది. రాజస్థాన్ రాయల్స్ జట్టులో గత కొద్దిరోజులుగా జరుగుతున్న మార్పులు ఇప్పుడు ఒక కొలిక్కి వచ్చాయి. ఆ జట్టు స్టార్ కెప్టెన్ సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్?కు ట్రేడ్ ద్వారా వెళ్లడం దాదాపు ఖాయమైంది. గత సీజన్‌లో సంజూ గాయపడటంతో జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. దీంతో సంజూ స్వయంగా జట్టు మార్పు కోరుకోగా, మేనేజ్‌మెంట్ కూడా అంగీకరించింది. ఈ క్రమంలో ఖాళీ అయిన కెప్టెన్సీ స్థానం కోసం పలువురు సీనియర్ల పేర్లు వినిపించినా, చివరికి రియాన్ పరాగ్ నే వరించింది. ఈ నియామకానికి ముందు హెడ్ కోచ్ కుమార్ సంగక్కర జట్టులోని కీలక ఆటగాళ్లను ఇంటర్వ్యూ చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, 2019 నుంచి జట్టుతో ఉన్న రియాన్ పరాగ్‌కు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. గత సీజన్‌లో సంజూ శాంసన్ అందుబాటులో లేని 8 మ్యాచ్‌లకు పరాగ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో జట్టును నడిపించిన తీరు, క్లిష్ట పరిస్థితుల్లో కోల్‌కతాపై చేసిన 95 పరుగుల ఇన్నింగ్స్ మేనేజ్‌మెంట్‌ను మెప్పించాయి. కుర్రాడైనా అనుభవం ఉన్న ఆటగాడిగా పరాగ్ ఈ పరీక్షలో పాసయ్యారు. రియాన్ పరాగ్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 84 మ్యాచ్‌లు ఆడి 1566 పరుగులు చేశారు. 2024 సీజన్‌లో 573 పరుగులతో (సగటు 52.09) సత్తా చాటారు. గత సీజన్‌లో కూడా 166.52 స్ట్రైక్ రేట్‌తో 393 పరుగులు చేసి తన దూకుడును నిరూపించుకున్నారు. బౌలింగ్‌లోనూ 7 వికెట్లు పడగొట్టి ఆల్ రౌండర్ గా పేరు తెచ్చుకున్నారు. రాహుల్ ద్రవిడ్ నిష్క్రమణ




తర్వాత ఇప్పుడు సంగక్కర కోచింగ్‌లో, పరాగ్ కెప్టెన్సీలో రాజస్థాన్ రాయల్స్ రెండో ఐపీఎల్ టైటిల్ కోసం వేట మొదలుపెట్టనుంది. 2008లో షేన్ వార్న్ సారథ్యంలో మొదటి టైటిల్ గెలిచిన రాజస్థాన్, ఆ తర్వాత మళ్లీ కప్ అందుకోలేదు. ఇప్పుడు ఒక యువ ఆటగాడికి పగ్గాలు అప్పగించడం ద్వారా జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఫ్రాంచైజీ భావిస్తోంది. మరి ఈ 24 ఏళ్ల కుర్ర కెప్టెన్ రాజస్థాన్ రాయల్స్ కిరీటాన్ని తెచ్చిపెడతాడో లేదో వేచి చూడాలి.

నినాదం

# ఆ రంగాల్లో పెట్టుబడితో లాభాల పంట..

## దీర్ఘకాలిక పెట్టుబడితో రాబడికి హామీ

ప్రపంచంలో టెక్నాలజీ రంగం కొత్త పుంతలు తొక్కుతుంది. ముఖ్యంగా పెరిగిన టెక్నాలజీ కారణంగా కొత్త అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల ఆలోచనా విధానలు కూడా మారుతున్నాయి. ముఖ్యంగా కొత్త, అభివృద్ధి చెందుతున్న రంగాలలో పెట్టుబడి పెట్టడం లాభదాయకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో మంచి రాబడినిచ్చే రంగాలపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు. కాబట్టి పెరుగుతున్న టెక్నాలజీ నేపథ్యంలో ఏయే రంగాల్లో పెట్టుబడితో అధిక రాబడి ఆర్జించవచ్చో? ఓ సారి తెలుసుకుందాం. ఆర్టిఫిషియల్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నందున ఈ రంగం అభివృద్ధికి పెట్టే పెట్టుబడి రాబోయే సంవత్సరాల్లో గణనీయమైన రాబడిని అందిస్తుంది. 2024 ప్రైవేట్ పెన్షన్ బేరోమీటర్ నివేదికలో క్యాపిటల్ గ్రూప్ విశ్లేషకులు పేర్కొన్న అనేక ప్రాంతాలలో ఏఐ ఒకటిగా. కొలంబియా థ్రెడ్‌నీడిల్, క్యాపిటల్ గ్రూప్‌ల సహకారంతో రూపొందించిన నివేదికలో కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణ సేవలు, ప్రపంచ వాణిజ్య మార్పులు, వ్యవసాయంలో భవిష్యత్తు పెట్టుబడి ఎంపికలు ఉన్నాయి. రాబోయే సంవత్సరాల్లో ఏఐ అన్ని రంగాల్లో విస్తరిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.




తయారీ లేదా ఆరోగ్య సంరక్షణలో అయినా ఏఐ ప్రతిచోటా ప్రత్యేక ముద్రను వేస్తుందని వివరిస్తున్నారు. అమెజాన్ వంటి పెద్ద కంపెనీలు ఏఐ పవర్డ్ రోబోట్‌లను తయారు చేస్తున్నాయి. ఇవి పనిని చాలా వేగంగా, సులభంగా చేస్తాయి. ఏఐ వల్ల ఉద్యోగాల్లోనూ పెద్ద సంక్షోభం ఏర్పడుతుందనేది వేరే విషయం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, టాటా ఎల్క్సి వంటి భారతదేశంలో ఏఐపై పని చేస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ సేవల రంగం కూడా వేగంగా మారుతోంది. ఒక కొత్త సాంకేతికత సెల్ థెరపీ, దీనిలో కణాలు శరీరం వెలుపల మారుస్తారు. ముఖ్యంగా వ్యాధిని నయం చేయడానికి సెల్ థెరపీ కీలక పాత్ర పోషిస్తుంది. క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధుల చికిత్సను సులభతరం చేసే జీన్ సైలెన్సింగ్ వంటి సాంకేతికతలపై పరిశోధనలు జరుగుతున్నాయి. పెద్ద పెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు ఈ దిశగా పెద్దఎత్తున పెట్టుబడి పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ కంపెనీలలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలికంగా మెరుగ్గా ఉంటుంది. కరోనా కాలం నుండి ప్రపంచవ్యాప్తంగా వస్తువుల సరఫరా పెద్ద మార్పులు వచ్చాయి. ప్రస్తుతం కంపెనీలు చైనాకు దూరంగా ఇతర దేశాలలో వస్తువులను తయారు చేయడం ప్రారంభించాయి. ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా దేశాలు దీని వల్ల లబ్ధి పొందుతున్నాయి. ఈ విషయంలో మెక్సికో ముందంజలో ఉంది. ముఖ్యంగా మంచి మౌలిక సదుపాయాల కారణంగా చైనాకు చెందిన కొన్ని కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాయి. అలాగే వ్యవసాయ రంగంలో కొత్త టెక్నాలజీల సాయంతో రైతులు మరింత దిగుబడి సాధిస్తున్నారు. ప్రెసిషన్ అగ్రికల్చర్ అనే సాంకేతికతలో పంటల ప్రతి అవసరాన్ని పొలాల్లో సెన్సార్‌లను అమర్చడం ద్వారా గుర్తించడం ద్వారా పంట దిగుబడిని 30 శాతం వరకు పెంచడానికి సహాయపడుతుంది. దీంతోపాటు కొత్తరకం విత్తనాలను అభివృద్ధి చేసే పనులు కూడా కొనసాగుతున్నాయి. బేయర్ లాంటి కంపెనీలు ఈ రంగంలో ముందుకు సాగుతున్నాయి. ఇలాంటి కంపెనీల్లో పెట్టుబడితో పెట్టుబడిదారులు అధిక లాభాలను పొందవచ్చు.

# ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే కనకవర్షమే.. పెట్టుబడిదారులూ ఓ లుక్కేయండి..

దీర్ఘకాలంలో అధిక రాబడి పొందటానికి సమర్థవంతమైన, నమ్మకమైన పెట్టుబడి మార్గాలను ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం. చాలామంది బ్యాంకుల్లోని ఫిక్స్ డ్ డిపాజిట్ పథకాలలో డబ్బులను పెట్టుబడి పెడతారు. నిర్ణీత కాలానికి వడ్డీతో పాటు అసలు తీసుకునే అవకాశం ఉంటుంది. వీటితో పాటు ఇటీవల మ్యూచువల్ ఫండ్స్ పై ప్రజలకు అవగాహన పెరిగింది. దీర్ధకాలంలో అధిక రాబడి వచ్చే అవకాశం ఉండడమే దీనికి కారణం. అయితే వీటిలో పెట్టుబడి పెట్టే ముందు అనేక అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలి. మెరుగైన రాబడి ఇస్తున్న ఫండ్ ను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు మీ పెట్టుబడికి తగిన రాబడిని అందుకోగలుగుతారు. అలాంటి వాటిలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ అలోకేటర్ ఫండ్ ఒకటి. దీని ద్వారా మీరు ఎలా సంపదను పెంచుకోవచ్చో తెలుసుకుందాం. స్థిరమైన పెరుగుదల.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ అలోకేటర్ ఫండ్ కొంతకాలంగా స్థిరమైన మెరుగుదలను కనబరుస్తోంది. దీర్ఘకాలంలో సంపద సృష్టించాలనుకునే వారికి చాలా మంచి ఎంపికగా మారింది. ఉదాహరణకు ఈ ఫండ్ లో 2003లో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, ఈ రోజు ఆ డబ్బు రూ.11.13 లక్షలు అవుతుంది. దీని ద్వారా దాదాపు 12.39 శాతం వార్షిక రాబడి అందుతోంది. ఈ ఫండ్ గతేడాది కూడా లాభాలలో నడిచింది. రూ. 10 వేల పెట్టుబడిని రూ.14,819 చేసింది. ఐదేళ్లలో అదే మొత్తం రూ.19,971కి పెరుగుతుంది. అంటే మీ పెట్టుబడిని దాదాపు రెట్టింపు చేస్తుంది. ఫండ్ కేటాయింపులు.. ఈ ఫండ్ ప్రధానంగా స్టాక్ మార్కెట్, బంగారం, ఆస్తిలో మీ డబ్బును పెట్టుబడి పెడుతుంది. ఈ మూడు మార్గాల ద్వారా మీ రాబడి గణనీయంగా పెరుగుతుంది. తద్వారా దీర్ఘకాలంలో రాబడికి దోహదపడుతుంది. ఈ ఫండ్ తన పెట్టుబడులలో 35 నుంచి వంద శాతం వరకూ రుణ రహిత ఎంపికలకు కేటాయిస్తుంది. పెట్టుబడిదారులు లాభాలను పెంచుకుంటూ పన్నులపై ఆదా చేయడానికి వీలు కల్పిస్తుంది. 2024 బడ్జెట్లో ప్రవేశపెట్టిన మార్పుల కారణంగా దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5 శాతం ఫ్లాట్ రేటుతో పన్ను విధిస్తున్నారు. దీని నుంచి పెట్టుబడిదారులు కనీసం 24 నెలల పాటు ఫండ్‌లో పెట్టుబడి పెట్టాలి. వడ్డీపై కూడా రాబడి.. మరో విషయం ఏమిటంటే కొనుగోలు చేసిన, మరొక పథకం నుంచి మారిన యూనిట్లను రీడీమ్ చేసినా, అలాట్‌మెంట్ చేసిన ఒక సంవత్సరంలోపు స్విచ్ చేసినా ఎటువంటి రుసుము లేకుండా 30 శాతం యూనిట్లను



విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ ఫీచర్ కారణంగా చాలా ఫ్లెక్సిబిలిటీ లభిస్తుంది. పెట్టుబడిదారులు అత్యవసర పరిస్థితుల్లో ఛార్జీలు లేకుండా తమ పెట్టుబడిలో కొంత భాగాన్ని యాక్సెస్ చేయడానికి వీలు కలుగుతుంది. ప్రధానంగా సమ్మేళనం వడ్డీ అనేది మునుపటి కాలాల నుంచి ప్రధాన, సేకరించిన వడ్డీ రెండింటిపై లెక్కిస్తారు. అంటే వడ్డీ అదనపు వడ్డీని సృష్టించడం మొదలు పెడుతుంది దీని వల్ల మీ పెట్టుబడి విపరీతంగా పెరిగే అవకాశం కలుగుతుంది. ఎంపికే కీలకం.. మార్కెట్లో వివిధ రకాల పెట్టుబడి మార్గాలు, అవకాశాలు ఉంటాయి. వాటిలో మీ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ టాలరెన్స్ కు అనుగుణంగా ఉండే వాటిని ఎంపిక చేసుకోవడం చాలా అవసరం. అదే మీ విజయానికి పునాది అని చెప్పవచ్చు. బలమైన రాబడిని అందించే ట్రాక్ రికార్డ్ ఉన్న మ్యూచువల్ ఫండ్‌లను అన్వేషించడం చాలా కీలకం.

## ఎరుపు రంగు కారు నంబర్ ప్లేట్ ఎవరు వినియోగిస్తారో తెలుసా? మీకు తెలియని ఎన్నో ఆసక్తికర విషయాలు




కారు ఉంటే దానికి నంబర్ ప్లేట్ తప్పక ఉంటుంది. 'మోటార్ వెహికల్ యాక్ట్ 1988' ప్రకారం ప్రతి వాహనం నంబర్ ప్లేట్‌పై స్థానిక కార్యాలయం జారీ చేసిన వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ ఉంటుంది. కానీ ఈ నంబర్ ప్లేట్లన్ని ఒకే రంగులో కాకుండా విభిన్న రంగులతో ఉంటాయి. ఒకటి నలుపు, మరొకటి పసుపు. అధికంగా కారులకు తెలుపు లేదా పసుపు రంగు ప్లేట్లు వాడతారని చాలా మందికి తెలుసు. అయితే మిగిలిన రంగుల అర్థం ఏమిటో తెలుసా? బ్లాక్ కలర్ నంబర్ ప్లేట్.. ఈ రకమైన బ్లాక్ కలర్ బోర్డ్‌లో వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ పసుపు రంగులో ఉంటుంది. నలుపురంగు నంబర్ ప్లేట్లు ఉన్న కార్లను వ్యాపారం కోసం ఉపయోగిస్తారు. వీరు అద్దె కారును కొనుగోలు చేస్తే, అది నల్ల నంబర్ ప్లేట్‌తో వస్తుంది. ఈ ప్లేట్ సాధారణంగా లగ్జరీ హెూటళ్లలో ఉపయోగిస్తుంటారు. అయితే బ్లాక్ నంబర్ ప్లేట్ ఉన్న వాహనాన్ని నడపడానికి డ్రైవర్ కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాల్సిన అవసరం లేదు. బ్లూ నంబర్ ప్లేట్లు.. విదేశీ దౌత్యవేత్తలను రవాణా చేయడానికి నీలం నంబర్ ప్లేట్‌లతో కూడిన వాహనాలు ఉపయోగిస్తారు. వాటిపై వివిధ రకాల కోడ్‌లు ఉంటాయి. ఈ కోడ్‌లు.. ఐక్యరాజ్యసమితి కోసం కాన్సులర్ కార్ప్స్ కోసం డిప్లొమాటిక్ కార్ప్స్ కోసం అని ఉంటాయి.రెడ్ నంబర్ ప్లేట్.. కార్యాలయం నుంచి శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్ వచ్చేంత వరకు మన దేశంలో జారీ చేసే తాత్కాలిక నంబర్ ప్లేటు ఇది. ఆ సంఖ్య సాధారణంగా రెడ్ కలర్ నంబర్ ప్లేట్ బోర్డుపై ఇస్తారు. కానీ ఇలాంటి తాత్కాలిక నంబర్లకు ఒక నెల మాత్రమే చెల్లుబాటు ఉంటుంది. అయితే ప్రతి రాష్ట్రానికి తాత్కాలిక నమోదుకు సంబంధించి దాని స్వంత నియమాలు ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో ఎరుపు నంబర్ ప్లేట్లు ఉన్న కార్లను రోడ్డుపైకి అనుమతించరు. గ్రీన్ నంబర్ ప్లేట్.. ఈ నంబర్ ప్లేట్ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలకు ఉపయోగిస్తారు. ఎలక్ట్రిక్ కార్లు, బైక్‌లు, ఈ-రిక్షాలు, బస్సులకు ఈ రంగు నంబర్ ప్లేట్‌లతో ఉంటాయి. దానిపై తెల్ల అక్షరాలతో కారు నంబర్ రాసి ఉంటుంది. పసుపు నంబర్ ప్లేట్.. ఈ నంబర్ ప్లేట్ అందరికీ సుపరిచితమే. ఈ రంగు నంబర్ ప్లేట్లు వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే వాహనాలపై ఉంటాయి. టాక్సీలు, ప్రైవేట్ క్యాబ్‌లు, ట్రక్కులు, బస్సులలో పసుపు రంగు నంబర్ ప్లేట్లు ఉంటాయి. కమర్షియల్ పర్మిట్ కలిగిన వాహనాలకు పసుపు రంగులో నంబర్ ప్లేట్ ఉంటుంది. వైట్ కలర్ నంబర్ ప్లేట్.. ఈ నంబర్ ప్లేట్ మనదేశంలో సర్వసాధారణం. వీటిపై నల్ల అక్షరాలతో వాహనం నంబర్ రాసి ఉంది. ఇటువంటి వాహనాలను వ్యక్తిగత అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తారు. సాధారణంగా కారు కొనుగోలు చేసిన వారందరికీ ఈ బోర్డు వస్తుంది. పైకి బాణం ఉన్న నంబర్ ప్లేట్లు.. పైకి బాణం ఉన్న నంబర్ ప్లేట్లు రక్షణ సిబ్బంది, రక్షణ మంత్రిత్వ శాఖకు చెందినవి. వీటితో సంబంధం ఉన్న వ్యక్తులు మాత్రమే ఈ ప్రత్యేక నంబర్ ప్లేట్‌ని ఉపయోగించడానికి అనుమతిస్తారు. అశోక స్థంభం ఉన్న రెడ్ నంబర్ ప్లేట్లు.. ఈ రకమైన నంబర్ ప్లేట్‌లను సామాన్య ప్రజలు, మంత్రులు, అధికారులు ఉపయోగించడానికి వీలులేదు. భారత రాష్ట్రపతి,ప్రతి రాష్ట్ర గవర్నర్ కార్లకు మాత్రమే ఎరుపు రంగు నంబర్ ప్లేట్లు ఉంటాయి. తమ వాహనాలపై భారతీయ చిహ్నం అశోక స్తంభాన్ని ప్రదర్శించడం దీని ప్రత్యేకత.

## బైక్ ధరతో కారు కొనేయొచ్చు.. అది కూడా ఎలక్ట్రిక్, ఎంతంటే



కారు కొనుక్కోవాలని ప్రతీ ఒక్కరి కోరిక. మధ్య తరగతి ప్రజలు కూడా ఇటీవల కార్లను వినియోగిస్తున్నారు. బ్యాంకులు రుణాలు ఇస్తుండడం, సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ కూడా పెరగడంతో చాలా మంది కార్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఇప్పటికీ చాలా మంది ధర, మెయింటెనెన్స్‌కు భయపడి కారు కొనుగోలు చేయడానికి వెనుకడుగు వేస్తుంటారు. అయితే ఒక హై ఎండ్ బైక్ ధరలో కారు వస్తే ఎలా ఉంటుంది. అది కూడా ఒక ఎలక్ట్రిక్. దీనిని నిజం చూసి చూపించింది ఇండోర్ రాష్ట్రానికి చెందిన వింగ్స్ ఈవీ అనే భారీ ఆటోమొబైల్ కంపెనీ. కేవలం రూ. 2 లక్షలకే ఒక బుల్లి ఎలక్ట్రిక్ కారును పరిచయం చేసింది. రాబిన్ ఈవీ పేరుతో తీసుకొస్తున్న ఈ కారును జీరో పొల్యూషన్‌తో పాటు తక్కువ ధరలో తీసుకురావడం విశేషం. ఒక పెద్ద సైజ్ బైక్‌ను పోలి ఉన్న ఈ కారు ప్రీ బుకింగ్స్ మొదలయ్యాయి. రూ. 5 వేలు ముందస్తుగా చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు. తొలి ఏడాదిలో 3 వేల యూనిట్స్ ని విక్రయించాలన్న లక్ష్యంతో కంపెనీ ఉంది. బెంగళూరులో ఇప్పటికే 300కిపైగా టెస్ట్ డ్రైవ్‌లను నిర్వహించారు. తొలికారును 2025లో లాంచ్ చేయనున్నారు. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో తొలుత వీటిని అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇక ధర తక్కువ అని ఫీచర్ల విషయంలో ఎలాంటి రాజీ పడాల్సిన పనిలేదు. ఈ కారు బేస్ వేరియంట్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 65 కి.మీ రేంజ్ ఇస్తుంది. టాప్ వేరియంట్ విషయానికొస్తే సింగిల్ ఛార్జ్‌తో ఏకంగా 90 కి.మీలు దూసుకెళ్లొచ్చు. రోజూ ఆఫీసుతో పాటు ఇతర పనులకు వెళ్లే వారికి ఈ కార్ బెస్ట్ ఆప్షన్‌గా చెప్పొచ్చు. పార్కింగ్ విషయంలో కూడా టెన్షన్ ఉండదు. ఈ కారు పొడవు.. ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ అంత ఉంటుంది. కారు ఇద్దరూ కంఫర్ట్‌గా కూర్చోవచ్చు. వెనకాల అయితే మరో చిన్న పిల్లాడు కూర్చునే అవకాశం ఉంటుంది. ఈ కారు ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తుంది ఎలాంటి గేర్లు ఉండవు. భద్రత విషయంలో కూడా ఈ కారు ప్రాధాన్యత ఇచ్చింది. సీట్ బెల్ట్, ఆడియో అలర్ట్స్, సేఫ్టీ వాయిలేషన్ అలర్ట్ వంటి అధునాతన ఫీచర్లను అందించారు. ఇక ఈ కారును మొత్తం మూడు వేరియంట్స్‌లో తీసుకొస్తున్నారు. ఈ కారు బేస్ వేరియంట్ రాబిన్ ఈవీ 'ఈ' వేరియంట్ ధర రూ. 1,99,000గా ఉండనుంది. ఇందులో ఏసీ ఉండదు. ఇక మరో వేరియంట్ 'ఎస్' ధర రూ. 2,49,000గా ఉండనుంది. ఇందులో కేవలం బ్లోయర్ మాత్రమే ఉంటుంది. ఇక టాప్ వేరియంట్ 'ఎక్స్' ధరను రూ. 2,99,000గా నిర్ణయించారు. ఇందులో ఏసీతో పాటు మరికొన్ని ఫీచర్స్ అందించనున్నారు.


# వ్యాపారం

## వాళ్ల జీతాల్లో కోత.. గుడ్ గవర్నెన్స్‌లో భాగంగా పేటీఎం కీలక నిర్ణయం..




ఫిన్‌టెక్ కంపెనీ ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తోంది. ఇందుకోసం ఇటీవల పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలో ఇటీవల వార్షిక సర్వసభ్య సమావేశం కి ముందు కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ఇందులో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల వార్షిక చెల్లింపులు (గౌరవ వేతనం లేదా జీతం) తగ్గించాలని కంపెనీ ప్రతిపాదించింది. స్టాక్ మార్కెట్‌కు అందించిన సమాచారంలో, మాతృ సంస్థ 97 కమ్యూనికేషన్స్, దాని బోర్డు డైరెక్టర్ల జీతాన్ని సవరించే పనిలో ఉన్నట్లు తెలిపింది. కంపెనీ12 సెప్టెంబర్ 2024న జరగనుంది. దీనికి ముందు కంపెనీ బోర్డు ఈ ప్రతిపాదనపై చర్చించాలని నిర్ణయించింది. సుపరిపాలనకు కట్టుబడిన పేటీఎం.. ఆర్థిక క్రమశిక్షణ, సుపరిపాలనకు కట్టుబడి ఉందని తెలిపారు. అందువల్ల, బోర్డు సభ్యుల జీతం కోసం కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేస్తోంది. దీనిపై సమయంలో వాటాదారుల అనుమతి కూడా తీసుకుంటుంది. సవరించిన జీతాన్ని, ప్రతి నాన్-ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ల వార్షిక చెల్లింపులు గరిష్టంగా రూ. 48 లక్షలుగా ఉంటుందని కంపెనీ ప్రతిపాదించింది. ఇందులో రూ.20 లక్షల ఫిక్స్‌డ్ కాంపోనెంట్ ఉంటుంది. కొత్తగా సవరించిన జీతం ఏప్రిల్ 1, 2024 నుంచి అమలులోకి వస్తుంది. మార్కెట్‌లోని ఇతర కంపెనీలను పరిశీలించిన తర్వాతే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. మార్కెట్‌లోని ఇతర సారూప్య రంగాలకు చెందిన కంపెనీల వేతన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త జీతాల నిర్మాణం తయారు చేసినట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుతం కంపెనీ నాన్ ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ అశిత్ రంజిత్ లీలానీ వార్షిక వేతనం రూ.1.65 కోట్లు, గోపాల్ సముద్రం శ్రీనివాసరాఘవన్ సుందరరాజన్ వార్షిక వేతనం రూ.2.07 కోట్లుగా ఉంది.

## ఇలా చేస్తే మీ క్రెడిట్ స్కోర్‌ను పరుగులు పెడుతుంది.. చిన్న చిట్కాలే కానీ రిజల్ట్ పక్కా..




జీవితంతో ఉన్నత స్థానానికి చేరుకోవాలని, ఆర్థికంగా విజయం సాధించాలని ప్రతి ఒక్కరూ కోరుకొంటారు. అందుకోసం చాలా రకాలుగా శ్రమిస్తారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి అనేక ప్రణాళికలు వేసుకుంటారు. వాటిలో బలమైన క్రెడిట్ స్కోర్‌ను నిర్మించుకోవడం కూడా ఒకటి. ఆర్థిక స్థిరత్వం, భవిష్యత్తులో మెరుగైన ఆర్థిక అవకాశాలను పొందేందుకు అది చాలా అవసరం. మెరుగైన క్రెడిట్ స్కోర్ కారణంగా అనుకూలమైన రుణ నిబంధనలు, తక్కువ వడ్డీ రేట్లు తదితర ప్రయోజనాలు కలుగుతాయి. అయితే క్రెడిట్ స్కోర్‌ను ఎలా పెంచుకోవాలో చాలామందికి తెలియదు. ముఖ్యంగా యువతకు ఈ విషయంపై అవగాహన ఉండదు. ఈ ఐదు చిట్కాలను పాటించి క్రెడిట్ స్కోర్ ను మెరుగుపర్చుకోవచ్చు. చిన్న రుణాలు.. క్రెడిట్ స్కోర్ పెంచుకోవడానికి చిన్న టికెట్ రుణాలు చాలా ఉపయోగపడతాయి. వాటిని తీసుకోవడాన్ని ప్రారంభించాలి. చిన్న టికెట్ రుణాలు అంటే చెల్లించడానికి చాలా సులభంగా ఉండే చిన్న రుణాలు. వీటిని తీసుకున్న తర్వాత ప్రతినెలా వాయిదాలు సక్రమంగా చెల్లించాలి. చిన్న రుణాలే కాబట్టి ఆర్థిక భారం ఉండదు. వీటి వాయిదాలను విజయవంతంగా చెల్లిస్తున్నప్పుడు మీ క్రెడిట్ స్కోర్ పెరుగుతూ ఉంటుంది. సకాలంలో క్రెడిట్ చెల్లింపులు.. సకాలంలో క్రెడిట్ చెల్లింపులు చేయడ వల్ల క్రెడిట్ స్కోర్ పెరుగుతుంది. కాబట్టి ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. మీరు చెల్లింపు కోసం సముచితంగా లేరని భావిస్తే, రుణంగా పరిగణించండి. దీనికి తక్కువ వడ్డీతో పాటు సులభ వాయిదాలు ఉంటాయి. మీరు సక్రమంగా క్రెడిట్ చెల్లింపులు చేయకపోతే ఆ ప్రభావం క్రెడిట్ స్కోర్ పై పడుతుంది. అది తగ్గిపోయే ప్రమాదం కూడా ఉంది. క్రెడిట్ కార్డులు.. చాలా మంది ఎక్కువ కార్డులను తీసుకుంటారు. దీనివల్ల నెలవారీ చెల్లింపులను ట్రాక్ చేయడం కష్టంగా మారుతుంది. ఒక్కోసారి మర్చిపోయే అవకాశం కూడా ఉంటుంది. ఆర్థికంగా భారంగా కూడా మారవచ్చు. మీరు ఇలాంటి పరిస్థితిలో ఉంటే అన్ని చెల్లింపులను మూసివేయడానికి వ్యక్తిగత రుణంగా మార్చుకోవచ్చు. ఈ విధంగా మీరు బిల్డింగ్ క్రెడిట్‌ను మరింత సులభతరం చేసే ఒక చెల్లింపును ఎంపిక చేసుకోవచ్చు. క్రెడిట్ నివేదిక. మీ క్రెడిట్ నివేదికను క్రమం తప్పకుండా అర్థం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. మీరు ఆర్థికంగా ఎంత బాధ్యతగా ఉంటున్నారో క్రెడిట్ స్కోర్ తెలియజేస్తుంది. దాన్ని మరింతపెంచుకోవడానికి మీ క్రెడిట్ నివేదికను క్రమం తప్పకుండా సమీక్షించాలి. పెట్టుబడులు.. జీవితంతో ముందుకు వెళ్లడానికి రుణాలు తీసుకోవడం కూడా చాలా అవసరం. అయితే వాటిని ఎందుకు ఉపయోగిస్తున్నారో తెలుసుకోవాలి. వ్యాపారం తదితర వాటిలో పెట్టుబడి పెట్టడం వల్ల మీ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవచ్చు. క్రెడిట్ స్కోర్ ఎక్కువగా ఉంటే మీకు తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తాయి. మీ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవడానికి, మీ జీవనశైలిని పెంచుకోవడానికి రుణాలను ఉపయోగించండి.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# గర్భధారణ సమయంలో బొప్పాయి తినడం వల్ల అబార్షన్ అవుతుందా? వైద్యులు ఏం చెబుతున్నారు?



గర్భధారణ సమయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తల్లి, బిడ్డ ఇద్దరి భద్రత ముఖ్యం. చిన్న పొరపాటు కూడా తల్లి, బిడ్డపై ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి ఇది కారణం. ప్రెగ్నెన్సీ సమయంలో బొప్పాయి తినకూడదని మీరు తరచుగా వినే ఉంటారు. ఇంటి పెద్దలు కూడా అలానే చెబుతుంటారు. వైద్యులు కూడా వివిధ సలహాలు ఇస్తారు. గర్భిణీ స్త్రీలు బొప్పాయి తింటే గర్భస్రావం అవుతుందని కూడా కొందరు అంటున్నారు. ఇందులో ఎంత నిజం ఉందో చెబుతారా? ఒక అధ్యయనం ప్రకారం, గర్భధారణ సమయంలో పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం లేదా అకాల డెలివరీ ప్రమాదాన్ని పెంచుతుందని, పండిన బొప్పాయి తినడం గర్భస్రావం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎలుకలపై చేసిన ప్రయోగం తర్వాత 2002లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో పండిన బొప్పాయిని తిన్న గర్భిణీ ఎలుకలకు గర్భస్రావం అయ్యే ప్రమాదం తక్కువగా ఉందని, అయితే పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం, నెలలు నిండకుండానే డెలివరీ అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బొప్పాయిలో ఉండే ఎంజైమ్‌ల వల్ల గర్భస్థ శిశువుకు నష్టం పెరుగుతుంది. అయితే, ఇప్పటి వరకు మనుషులపై అలాంటి అధ్యయనం లేదా పరిశోధన జరగలేదు. కానీ బొప్పాయి వినియోగం పూర్తిగా ప్రయోజనకరం లేదా హానికరం అని చెప్పలేము. పచ్చి లేదా పండిన బొప్పాయిలో లేటెక్స్, పాపైన్ ఉంటాయి. ఇవి అభివృద్ధి చెందుతున్న పిండానికి హానికరం. బొప్పాయిలోని రబ్బరు పాలు గర్భాశయం సంకోచించటానికి కారణమవుతుంది. ఇది పిండానికి చాలా హానికరం. గర్భధారణ సమయంలో పండిన బొప్పాయి తినడం ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ప్రజలు పండిన, సగం పండిన బొప్పాయి మధ్య గందరగోళానికి గురవుతారు. అటువంటి పరిస్థితిలో పిల్లలకి ఎటువంటి హాని జరగకుండా ఉండటానికి ప్రజలు బొప్పాయి తినకుండా ఉంటారు. బొప్పాయిని ప్రెగ్నెన్సీ సమయంలో తినవచ్చని, పూర్తిగా పక్వానికి వచ్చి తక్కువ పరిమాణంలో తీసుకుంటేనే తినవచ్చని కొందరు ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పూర్తిగా పండిన బొప్పాయి విటమిన్ సి, విటమిన్ ఇ మూలం. అలాగే ఫోలిక్ యాసిడ్‌తో పాటు ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.(గమనిక: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది.



# 6 నెలల వయస్సు వరకు పిల్లలకు నీరు తాగించకూడదు..



ఇంట్లోకి చిన్న అతిథి రాగానే.. తాతయ్యలే కాదు, ఇంట్లోని ప్రతి పెద్దాయన కూడా బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులకు సలహాలు ఇవ్వడం మొదలుపెడతారు. తల్లిదండ్రులకు వైద్యులు ఇచ్చే సలహాల్లో ఆరు నెలల శిశువులకు నీరు తాగించకూడదనేది ఒకటి. నవజాత శిశువులకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇస్తారు. వైద్యులు వారికి ఆహారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. అంతే కాదు తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వడానికి వైద్యులు నిరాకరిస్తున్నారు. వేసవిలో విపరీతమైన వేడిలో, కొన్నిసార్లు తల్లులు, కుటుంబ సభ్యుల మనస్సులో ఒక ప్రశ్న ఉంటుంది. పిల్లవాడు నీరు తాగకపోతే అతనికి ఏ డీహైడ్రేషన్ సమస్య వస్తుందని. అయితే, వైద్యుల తెలిపిన వివరాల ప్రకారం, తల్లి పాలలో 80 శాతం నీరు ఉంటుంది. ఇది అవసరమైన అన్ని పోషణ, డీహైడ్రేషన్ సమస్యను తీరుస్తుంది. 6 నెలల వరకు నవజాత శిశువుకు తల్లి పాలు తప్ప మరేమీ ఇవ్వకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. నవజాత శిశువులకు నీరు ఇస్తే, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ప్రమాదం ఉంది. ఈ స్థితిలో శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఎలక్ట్రోలైట్స్ శరీరంలోని ఖనిజాలు, రక్తం, మూత్రం, ఇతర శరీర ద్రవాలలో ఉంటాయి. సోడియం, క్లోరిన్, ఫాస్ఫేట్, పొటాషియం అన్నీ ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సరైన సమతుల్యతను నిర్వహించడం చాలా ముఖ్యం. ఇది కాకుండా, ఫార్ములా పాలు తాగే పిల్లల శరీరం కూడా నీరు లేకుండా హైడ్రేట్ గా ఉంటుంది. అందుకే కనీసం 6 నెలల తర్వాత మాత్రమే పిల్లలకు నీరు ఇవ్వాలని సూచిస్తున్నారు వైద్యులు. డైల్యూటెడ్ ఫార్ములా పాలను తినిపించడం లేదా ఎక్కువ నీరు ఇవ్వడం శిశువు ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుందని గుర్తుంచుకోండి. సాధారణ నీటిని తాగడం వల్ల బిడ్డకు ఎలాంటి శక్తి అందదని నిపుణులు చెబుతున్నారు. ఇది కాకుండా ఇది ఖాళీ కేలరీలను కూడా కలిగి ఉంటుంది. కనుక ఇది 6 నెలల ముందు శిశువుకు ప్రయోజనకరం కాదు. బదులుగా ఇది పిల్లల అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది.

## బాడీ మసాజ్ ఎందుకు, ఎవరికి అవసరం..? తప్పక తెలుసుకోవాలి.



వయసు యాభై దాటితే మీ దినచర్యలో బాడీ మసాజ్ కూడ చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. 45 నుంచి 50 దాటితే శరీరం లోపల ఉండే భాగాల ఎదుగుదల ఆగిపోయి అరుగుదల క్రమంగా మొదలవుతుంది. ఫలితంగా పని సామర్థ్యం తగ్గి కాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పులు, బ్యాక్ పెయిన్ వంటి రుగ్మతలు వేధిస్తుంటాయి. వీటికి చెక్ పెట్టాలంటే రెగ్యులర్ బాడీ మసాజ్ చాలా అవసరం. ఇందుకోసం మన ఇంట్లోనే రోజూ ఉదయం స్నానం చేయడానికి ఓ అరగంట ముందు 10-15 నిమిషాల పాటు మనకు మనంగా బాడీ మసాజ్ చేసుకుంటే సరిపోతుంది. బాడీ పెయిన్స్ మరీ ఎక్కువగా ఉంటే ఫిజియోథెరపీ వంటివి తప్పవు. బాడీ మసాజ్‌తో ఒళ్లు నొప్పులు రాకుండా ఉంటాయి. ముందే ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నట్టయితే అవి తగ్గిపోతాయంటున్నారు. ఇంట్లోనే బాడీ మసాజ్ ఎలా చేసుకోవాలి.. ఆరోగ్య ప్రయోజనాలేంటో కూడా తెలుసుకుందాం.. ఇంట్లోనే బాడీ మసాజ్ చేసుకోడానికి కొబ్బరి నూనె లేదా బాదం నూనెను ఉదయం స్నానానికి వెళ్ళేముందు ఓ పది పదిహేను నిమిషాల పాటు ఆయిల్‌తో బాడీ మసాజ్ క్రమం తప్పకుండా చేసుకుంటే..చక్కటి ఫలితం ఉంటుంది. ఇందుకోసం కావాలంటే మంచి ఆయుర్వేద పెయిన్ రిలీఫ్ ఆయిల్ వాడినా మంచి ఫలితాలే వస్తాయి. మసాజ్ కోసం కావాల్సిన ఆయిల్ తీసుకుని మన చేతి వేళ్ళతోనే రాపిడి ప్రెషర్ తో ఒళ్ళంతా పట్టించాలి. ఓ పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. రోజూ క్రమం తప్పకుండా ఇలా చేస్తూ ఉంటే ఒళ్లు నొప్పులు మన దరి చేరవంటున్నారు. బాడీ పెయిన్స్ విషయంలో ముందే జాగ్రత్త పడటం చాలా అవసరం అంటున్నారు నిపుణులు. లేదంటే ఆ తర్వాత వైద్యం కోసం, ఫిజియోథెరపీ మెడిసిన్లు అంటూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇలాంటి జాయింట్ పెయిన్స్, బాడీ పెయిన్స్ మరింత తీవ్రమైతే వేలకు వేలు పెట్టి ఖరీదైన సర్జరీలు, టెన్షన్లు తప్పవని నిపుణులు సూచిస్తున్నారు. ఒళ్లు నొప్పుల సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు అనేక మంది ఉన్నారు. కాబట్టి రోజూ మనం బాడీ మసాజ్ అలవాటు చేసుకుంటే.. ఎన్నో అనారోగ్య సమస్యలను రాకుండా ముందే అడ్డుకోగలం అంటున్నారు. ప్రతిరోజూ మార్నింగ్ వాక్ తరువాత రెగ్యులర్‌గా బాడీ మసాజ్ చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు. బాడీ మసాజ్ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఒకటి, రెండు కాదు.. ఏకంగా 25 రకాల లాభాలు ఉన్నాయని వైద్యులు, నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బాడీ మసాజ్ వలన రక్తప్రసరణ బాగా మెరుగవుతుంది. లో బ్లడ్ ప్రెషర్ ను నియంత్రిస్తుంది. ఒత్తిడిని బాగా తగ్గిస్తుంది. మజిల్స్ టెన్షన్ ని తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాడీ పెయిన్స్ రాకుండా ఉంటాయి. ఆల్రెడీ బాడీ పెయిన్స్ ఉంటే తగ్గుతాయి.

## ఆ దేశంలో కొన్ని రకాల కాస్మెటిక్ ఉత్పత్తులతో తీవ్ర అనారోగ్యం.. వాటి అమ్మకం, వినియోగంపై నిషేధం..

ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కొన్ని రకాల మెడిసిన్స్ అమ్మకాలపై నిషేధం విధించింది. ముఖ్యంగా మైక్రోడెర్మాబ్రేషన్ వంటి కొన్ని కాస్మెటిక్ విధానాలకు ఉపయోగించే ముందులు లేదా కాస్మెటిక్ సర్జరీ తర్వాత నొప్పిని తగ్గించడానికి అమ్మే ఓవర్-ది-కౌంటర్ అనాల్జేసిక్ ఉత్పత్తులను ఉపయోగించవద్దని వినియోగదారులను హెచ్చరిస్తోంది. లేజర్ హెయిర్ రిమూవల్, టాటూయింగ్, చెవులు లేదా శరీరం మీద ఎక్కడైనా పియర్సింగ్ చేసినప్పుడు ఉపయోగిస్తున్న కొన్ని రకాల మందులపై నిషేధం విధించింది. అంతేకాదు ఫెడరల్ చట్టాన్ని ఉల్లంఘించి ఈ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసినందుకు ఆరు కంపెనీలకు, ఏజెన్సీలకు హెచ్చరిక లేఖలు జారీ చేసింది ప్రకారం ఈ ఉత్పత్తుల్లో కొన్ని లిడోకాయిన్ వంటి పదార్థాలను కలిగి ఉన్నాయని లేబుల్ చేయబడ్డాయి. ఇవి ఓవర్-ది-కౌంటర్ అంటే నొప్పి నివారణ ఉత్పత్తుల కోసం అనుమతించిన దానికంటే ఎక్కువ సాంద్రతలలో లిడోకాయిన్ వంటి పదార్థాలు ఉన్నట్లు తాము గుర్తించినట్లు చెప్పారు. డ్రగ్స్ కోసం కొత్త మార్కెటింగ్ కోడ్ "కొన్ని కాస్మెటిక్ చికిత్స చేసే సమయంలో ఈ ఉత్పత్తుల్లో క్రమరహిత హృదయ స్పందన, మూర్ఛ వంటి వ్యాధులకు కారకులుగా మారవచ్చు అని పేర్కొన్నారు. అంతేకాదు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కూడా కలుగుతున్నాయని తాము గుర్తించినట్లు.. ఈ ఉత్పత్తులు తీసుకుంటున్న వినియోగదారుడు తీసుకునే ఆహార పదార్థాలతో కూడా సంకర్షణ చెందుతాయి, "అని పేర్కొంది. "ఈ ఉత్పత్తులు వినియోగదారులకు ఆమోదయోగ్యంకాని నష్టాలను కలిగిస్తున్నాయని.. కనుక మార్కెట్లో వీటి అమ్మకాలపై నిషేధం విధించినట్లు జిల్ ఫర్మాన్, సెంటర్‌లో కంప్లైయన్స్ ఆఫీసర్స్ డైరెక్టర్ అన్నారు. గత దశాబ్దంలో ఇలాంటి ఉత్పత్తుల గురించి వినియోగదారులకు హెచ్చరికలు చేసినప్పటికీ, ఏజెన్సీ ఆన్‌లైన్ , రిటైల్ స్టోర్‌ల్లో అందుబాటులో ఉంచుతూ ప్రమాదకరమైన ఉత్పత్తులను అమ్మకాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. డుచెన్ మస్కులర్ డిస్ట్రోఫీకి స్టెరాయిడ్ ఉపయోగించని చికిత్సకు ఆమోదం తెలిపింది. అంతేకాదు ఈ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో లేదా ఉత్పత్తులు చట్టాన్ని ఉల్లంఘించలేదని తాము భావిస్తున్నట్లు వివరిస్తూ అందుకు తగిన సమాచారాన్ని అందించాలని.. తాము ఇచ్చిన నోటీసు అందుకున్న 15 రోజులలోపు ఈ కంపెనీ యాజమాన్యం ప్రతిస్పందించాలని కంపెనీలను కోరింది. ఇప్పటికే ఉత్పత్తి చేసిన మెడిసిన్స్ ను స్వాధీనం చేసుకోవడం లేదా ఉల్లంఘించే ఉత్పత్తుల తయారీని, పంపిణీని నిలిపివేయాలని సదరు కంపెనీలను కోరుతోంది. అంతేకాదు ఇందుకు సంబంధించిన కోర్టు ఆర్డర్‌తో సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మైక్రోడెర్మాబ్రేషన్ ఉత్పత్తులనులోకి ప్రవేశించకుండా, వినియోగదారుల వద్దకు చేరకుండా ఆపడానికి ఈ కంపెనీలలో కొన్నింటిని హిట్ లిస్ట్ లో ఉంచినట్లు పేర్కొంది.



## ఉదయాన్నే పరగడుపున ఈ డ్రింక్ తాగితే అనేక వ్యాధులు పరార్.. అద్భుతమైన హోమ్ రెమిడీస్



ప్రస్తుతం చాలా మందిని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. కొన్ని హోమ్ రెమీడిస్ పాటించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అయితే ఉదయాన్నే కొన్ని డ్రింక్స్ తాగినట్లయితే శరీరంలోని కొన్ని సమస్యలు తొలగిపోతాయి. అల్లం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అన్ని వేళలా మందులు తీసుకునే బదులు, మీరు వంటగదిలోని కొన్ని వస్తువులపై ఆధారపడవచ్చు. అటువంటి పదార్థాలలో ఒకటి అల్లం. అల్లం అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, జింక్, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులో క్రోమియం, విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్ కూడా ఉన్నాయి. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడగలదు. మీరు టాన్సిల్ సమస్యలతో బాధపడుతుంటే మీకు అల్లం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. గొంతు నొప్పి నుండి టాన్సిలైటిస్ వరకు అన్నింటి నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయి. అలాగే ఇవన్నీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అల్లం రసం కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో అల్లం రసం తాగడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం రసం మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మేలు చేస్తుంది.ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా అల్లం రసం కలపండి. క్రమం తప్పకుండా తాగాలి. అప్పుడు తేడా మీకే అర్థమవుతుంది. మీరు రోజంతా చాలా ఉల్లాసంగా ఉండగలరు. అయితే మీరు నిద్రలేచి, ఖాళీ కడుపుతో ఈ అల్లం నీటిని తాగితే, మీరు కేవలం కొన్నింటితో బరువు తగ్గవచ్చు. అందుకే ఈరోజు నుండే అలవాటు చేసుకోండి. (నోట్: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. వీటిని అనుసరించే ముందు వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నాము.

# డయాబెటిస్ ఎన్ని రకాలు..

## ఎలా సంభవిస్తుంది? నివారణ చర్యలు ఏమిటి?



డయాబెటిస్ చాలా సాధారణ సమస్యగా మారుతోంది. నేడు ప్రతి ఇంట్లో ఒకరు మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. భారతదేశంలో ఈ సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. ఇప్పుడు యువత చిన్న వయస్సులోనే ఈ వ్యాధికి గురవుతున్నారు. డయాబెటిస్ అనేది చాలా తీవ్రమైన సమస్య. ఇది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పెరుగుదల కారణంగా సంభవిస్తుంది. దానిని నియంత్రించకపోతే అది క్రమంగా శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రకారం, 2030 నాటికి భారతదేశంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు అవుతుంది. మధుమేహం రావడానికి గల కారణాలను, దానిని నివారించే మార్గాలను తెలుసుకుందాం. మధుమేహం అంటే ఏమిటి? శరీరంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగినప్పుడు ఈ సమస్యను డయాబెటిస్ అంటారు. వాస్తవానికి, శరీరంలోని రక్తంలో గ్లూకోజ్‌ను నియంత్రించే పని ఇన్సులిన్ ద్వారా జరుగుతుంది. ఇది ప్యాంక్రియాస్‌లో ఉత్పత్తి అవుతుంది. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి అయిన తర్వాత రక్తంలో ఉండే గ్లూకోజ్‌ను నియంత్రిస్తుంది. కానీ కొన్ని కారణాల వల్ల క్లోమం తగినంత పరిమాణంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోయినప్పుడు, శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహం సమస్య ప్రారంభమవుతుంది. మధుమేహం రకాలు మధుమేహం ప్రధానంగా రెండు రకాలుగా విభజించబడింది: టైప్-1, టైప్-2 మధుమేహం. ప్యాంక్రియాస్‌లో ఏదైనా లోపం కారణంగా చిన్నతనం నుండి ఇన్సులిన్ ఉత్పత్తి కానప్పుడు, పిల్లవాడు టైప్-1 డయాబెటిస్‌కు గురవుతాడు. అతని శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోవటం వలన అతని జీవితాంతం ఇన్సులిన్ ఇవ్వబడుతుంది. టైప్-2 మధుమేహం మన అనారోగ్య జీవనశైలి కారణంగా వయస్సు పెరిగేకొద్దీ వస్తుంది. కానీ ఈ రోజుల్లో యువత అనారోగ్య జీవనశైలి చిన్న వయస్సులోనే టైప్-2 డయాబెటిస్‌కు కారణం అవుతోంది. టైప్ 2 డయాబెటిస్‌కు కారణాలు అనారోగ్య జీవనశైలి ఒత్తిడి బయట జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం క్రమరహిత జీవనశైలి తక్కువ శారీరక శ్రమ ఊబకాయం మధుమేహం నివారణ జీవనశైలి మెరుగుదల ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం ఆహారంలో ఆకుపచ్చని కూరగాయలు, సీజనల్ పండ్లను తీసుకోవడం తగినంత నీరు తాగడం ఒత్తిడిని తగ్గించండి శారీరకంగా చురుకుగా ఉండటం రోజూ అరగంట పాటు వ్యాయామం లేదా వాకింగ్ చేయడం స్థూలకాయాన్ని నియంత్రిస్తుంది కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటి వ్యాధులను నివారించడం బయట జంక్, ఫాస్ట్ ఫుడ్ తక్కువగా తినండి

## బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..? కిడ్నీలో రాళ్లు కరుగుతాయా?



ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక కొందరు బీర్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. ఇది నిజం కాదని నెఫ్రోలాజిస్ట్‌లు నొక్కి చెబుతున్నారు. అయితే బీర్ తాగేవారు లావు అవుతారు అనడంలో కొంతమేర వాస్తవం ఉంది. అయితే బరువు పెరిగేందుకు ఇది మంచి పద్దతి కాదు. ఒక గ్రాము ఆల్కహాల్ సేవిస్తే 7 కేలరీలు శరీరానికి అందుతాయి. ఈ క్రమంలో బీర్ అధికంగా సేవిస్తే బరువు పెరుగుతారు. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జుట్టుకు ఏదైనా రాసుకుంటే పెరుగుతుందనే దాన్ని సైన్స్ విశ్వసించదు అంటున్నారు డాక్టర్లు. ఆల్కహాల్ కొద్ది మొత్తంలో తీసుకుంటే మంచిదని గతంలో పరిశోధనల్లో తేలింది. అయితే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. జనవరిలో విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఎంత మొత్తంలో ఆల్కహాల్ తీసుకున్నా కూడా అది ఆరోగ్యానికి చేటే అని వెల్లడించింది. ఆల్కహాల్ సేవనం పలు రకాల క్యాన్సర్లకు కారణం అవుతుంది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్ తాగే వారికి 10 సంవత్సరాల్లో దెబ్బతింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.



## ఈ నెల 14న రైజ్‌లో ప్రత్యేక వర్క్‌షాప్

- మహిళా సాధికారతకు నైపుణ్య శిక్షణ
- కూలెక్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో నిర్వహణ
- ఔత్సాహిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, ఫిబ్రవరి 13 (

మహిళామణులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 14న ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్)లో ప్రత్యేక జాగృతి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శీతలీకరణ, కిచెన్ అండ్ ఫుడ్ ఎక్విప్‌మెంట్ తయారీలో సుదీర్ఘ అనుభవం కలిగిన కూలెక్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (విజయవాడ) భాగస్వామ్యంతో ఈ వర్క్‌షాప్ ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సూక్ష్మ, చిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులు, చిన్నస్థాయి వ్యాపార అభివృద్ధికి ప్రయో జనం కల్పించేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ అవగాహన, శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గుంటుపల్లితో సహా ఇబ్రహీంపట్నం మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు ఔత్సాహిక మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలక్టర్ లక్ష్మీశ సూచించారు.

## ఏసిబి వలలో గంగవరం ఎస్సై, కానిస్టేబుల్



పోలవరం జిల్లా గంగవరం ఎస్సై వెంకటేష్, కానిస్టేబుల్ వీరబాబు ఎసీబి వలలో చిక్కుకున్నారు.గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన దాసరి శివకుమార్ అనే వ్యక్తిపై అతని భార్య ఫిర్యాదు చేసిన కేసులో రూ.20 వేల లంచం అడుగగా శివకుమార్ ఏసీబీ అధికారులకు సమాచారం అందిం చారు. దీంతో రూ.15 వేల కానిస్టేబుల్ వీరబాబుకు శివకుమార్ ఇస్తుం డగా డీఎ స్పీ కిషోర్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు దాడిచేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టు కు న్నా రు. ఎస్సై వెంకటేష్ లంచం సొమ్ము తీసుకోమని చెప్పారని కానిస్టేబుల్ వీర బాబు చెప్పడంతో ఎస్సై, కానిస్టేబుల్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.

## ఆదునిక యుగంలో అందరికి క్రీడలు, వ్యాయామం చాలా అవసరం

- ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ మనోజ్ అమరనేని



సబ్ జూనియర్ బాల బాలికల రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో గల ఏకత్వా పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపికలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లా జట్టుకుకి ప్రాతినిత్యం వహిస్తున్నారని పాఠశాల వ్యాయామ విద్యా విభాగాదిపతి విజయ్ కుమార్ గోగుల మూడి తెలిపారు. వీరు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఫిబ్రవరి 14, 15 తేదీలలో జరగబోయే 9వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటాని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శు క్రవారం పాఠశాల ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ నేటి (డిజిటల్ )ఆధునిక యుగంలో క్రీడలు శారీరక, మానసిక శ్రేయస్సును కాపాడు కోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయసుల వారికి వ్యాయామం, క్రీడలు చాలా అవసరమని, క్రీడల ద్వారా క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం వల్ల జీవనశైలి వ్యాధులను ఎదుర్కోవడానికి, మానసిక స్థితిని, ఉత్పాదకతను పెంచడానికి సహాయం దుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూర, ఉప ప్రధానోపాధ్యాయులు ఐశ్వర్య సంబశివన్ పాల్గొన్నారు.

# బాలింతలు, తల్లులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలి





- రక్తహీనతపై అవగాహన అవసరం
- లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి

విశాఖపట్నం, ఫిబ్రవరి 13

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి మహిళ, గర్భిణీ, బాలింత నిత్యం నాణ్యమైన మరియు సమతుల్య ఆహారం తీసుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి సూచించారు. ప్రపంచ అనీమియా అవేర్‌నెస్ డే సందర్భంగా లీఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డోమైన్ సంయుక్త ఆధ్వర్యంలో అగనంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు వారి మాతృత్వ ప్రయాణంలో సమతుల్య ఆహారం ఎంత ముఖ్యమో వివరించారు. ముఖ్యంగా ఐరన్, కాల్షియం అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగం అవసరాన్ని న్యూట్రిషనిస్టులు వివరించారు. రక్తహీనత సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. అనంతరం 50 మంది గర్భిణీలు మరియు బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, న్యూట్రిషనిస్టు మాధురి, క్రాంతికుమారి, జి.ఎన్.ఎమ్ భాగ్యలత, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గజేంద్రరావు, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జ్ చెల్లయ్యమ్మ (అగనంపూడి సెక్టార్), లీ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం



రంపచోడవరం, ఫిబ్రవరి 13 (భారత్ న్యూస్)

పోలవరం జిల్లా దేవీపట్నం మండలం కొండమొదలు కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శుక్రవారం మండలం వ్యాప్తంగా ఈ నెల 17 వ తేదీన నిర్వహించబోయే నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం పై సిబ్బందికి శిక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.దేవీపట్నం ఎమ్పీడీఓ ఎస్ సాల్మన్ రాజు అధ్యక్షతన వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పిహెచ్సి పరిధిలోని ఎనిమిది పాఠశాలలు నాలుగు అంగన్వాడీల్లో ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరూ ఆ రోజున ఆల్బెండజోల్ 400 మి.గ్రా వేసుకోవలసినదిగా చెప్పారు. డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం వలన రక్తహీనత రాకుండా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ నాగార్జున ఎంపీహెచ్ఈవో ఆర్ నాగేశ్వరావు ఇతర వైద్య సిబ్బంది ఐసిడిఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.







# సనాతన ధర్మ ప్రచారానికి జీవితాన్ని అర్పించిన పొన్న కృష్ణమూర్తి

- నిజమైన ధార్మికతకు దక్కనున్న గౌరవం
- ప్రస్తుతం ఉన్న వాళ్లందరిలోకెల్లా అర్హుడు
- గుర్తించిన టీటీడి చైర్మన్ బి.ఆర్ నాయుడ



తిరుపతి, ఫిబ్రవరి 13 వేదోపనిషత్తుల అగాధ పాండిత్య ంతో, అచంచలమైనభక్తితో, మూడు దశాబ్దాల నిరంతర సేవతో హిందూధర్మ ప్రచార రంగంలో అపూర్వ కీర్తి గడించిన పౌరాణిక
శిరోమణి శ్రీ పొన్న కృష్ణమూర్తి. ఆయన ప్రతిభకు తిరుపతిలోని నాలుగు ప్రముఖ విశ్వవిద్యాలయాల అధిపతులు ఏకకాలంలో ప్రశంసాపత్రాలు జారీ చేయడం సంచలనం రేపింది. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న ఈ ఆధ్యాత్మిక విద్వాంసుడు, తన అసాధారణ శాస్త్రజ్ఞానం, నిష్కల్మషమైన ఆచరణ, సేవాభావంతో ధార్మిక రంగంలో ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పారు. ఆయన గత పాండిత్యం, ప్రతిభా పాటవం, నిజాయితీ, ధార్మిక నడవడిక మరియు అశ్రాంత కృషిని కొనియాడుతూ విశ్వవిద్యాలయ అధిపతులు గత ఏడాది ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆ సంస్థానాలకు సంబంధించిన విద్యావేత్తలు, పండితులు ప్రస్తుతం ఆయనను టిటిడి అనుబంధ సంస్థ అయిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ సెక్రటరీ పదవికి అత్యంత అర్హుడని, ప్రస్తుతం ఉన్న, పోటీ పడుతున్న వ్యక్తుల కంటే ఆయన నైతిక ధృఢత్వం, అనుభవం, నిజాయితీతో ఆ విభాగాన్ని అత్యున్నత విజయం వైపు నడిపిస్తారని నొక్కి వక్కాణిస్తున్నారు.

### భారతదేశంలో తొలిసారి అద్భుత రికార్డు:

2025 జూన్ నెలలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు నిరంతరంగా 12 గంటల పాటు ఆరు ఉపనిషత్తులపై అనర్గళంగా ఉపన్యాసం అందించారు. భారతదేశంలో ఈ రకమైన మొదటి కార్యక్రమంగా నిలిచిన ఈ అసాధారణ ప్రయత్నానికి గుర్తింపుగా 2025 జూన్ 11న ఆయనకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఆయన అపారమైన శాస్త్రజ్ఞానం, స్మరణశక్తి మరియు ప్రతిభకు ఇది స్పష్టమైన నిదర్శనంగా నిలిచింది.

### సనాతన ధర్మ సేవలో మూడు దశాబ్దాలు

తిరుపతి గ్రామీణ మండలం పానకం గ్రామంలో జన్మించిన శ్రీ పొన్న కృష్ణమూర్తి సంప్రదాయబద్ధమైన, ఆధ్యాత్మిక విలువలతో కూడిన కుటుంబ నేపథ్యం కలిగినవారు. తమ పూర్వీకుల కాలం నుండి వారసత్వంగా వచ్చిన బలమైన ఆధ్యాత్మిక వంశపారంపర్యంతో పెరిగిన ఆయన, చిన్న వయస్సు నుండే శ్రీ వేంకటేశ్వర స్వామి వారిపై అచంచలమైన భక్తి, పెద్దల పట్ల ప్రగాఢమైన గౌరవం మరియు సాత్త్విక స్వభావంతో జీవిస్తున్నారు. గడచిన మూడు దశాబ్దాలుగా హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లో కార్యక్రమ సమాయోజక సహాయకుడిగా సేవలందిస్తూ, సంస్థ యొక్క ఆధ్యాత్మిక గౌరవాన్ని మరింత ఉజ్జ్వలంగా నిలుపుతున్నారు. విశిష్టమైన వాక్పాటవంతో ఆధ్యాత్మిక విషయాలను శాస్త్రప్రమాణాలతో సరళంగా, హృద్యంగా వివరించే సామర్థ్యం ఆయనకు ఉంది. కోవిడ్ కాలంలో సామాజిక సేవకోవిడ్-19 మహమ్మారి సమయంలో సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని, రోగుల త్వరిత ఆరోగ్య పునరుద్ధరణ కోసం నిరంతరంగా 48 రోజుల పాటు శాంతి హోమాలు నిర్వహించడం విశేష ప్రశంసనీయం. బలమైన సామాజిక బాధ్యతతో, కరుణ మరియు దయతో నిండి చేసిన ఈ సేవ ఆయన సేవా మనస్తత్వానికి నిదర్శనం.

### యువతరంలో ధర్మ చైతన్యం

పిల్లలు మరియు యువతలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు మరియు ధర్మబోధనలను నాటాలనే సంకల్పంతో కృష్ణమూర్తి నిరంతరం కృషి చేస్తున్నారు. వేదాలు, ఉపనిషత్తుల సందేశాలను సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించి, వారి రోజువారీ జీవితంలో ఆధ్యాత్మిక స్పృహను కలిగించడం ఆయన లక్ష్యం.శ్రీ ఆదిశంకరాచార్యుల తత్వశాస్త్ర స్ఫూర్తితో, మతం, దైవభక్తి, వైరాగ్యం మరియు నీతిమూల్యాల సారాన్ని యువతలో వ్యాప్తి చేయాలనే ఉన్నత ఆశయం ఆయనది. అన్నమయ్య కీర్తనలలో ఉన్న దైవత్వం, భక్తి, విశ్వాసం మరియు వైరాగ్యం యొక్క లోతైన ఆధ్యాత్మిక సందేశాలను యువతరానికి అందించడానికి ఆయన కృషి చేస్తున్నారు. "నేటి పిల్లలే రేపటి బాధ్యతాయుతమైన పౌరులు" అనే నమ్మకంతో ఆయన పనిచేస్తున్నారు.

### విద్యావేత్తల ఏకగ్రీవ అభిప్రాయం

తిరుపతిలోని అయిదు ప్రముఖ విశ్వవిద్యాలయాల వైస్-ఛాన్సలర్లు మరియు రెక్టర్ లు ప్రశంసాపత్రాలు జారీ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లో ప్రోగ్రామ్ విభాగంలో మూడు దశాబ్దాలకు పైగా సేవలందిస్తున్న కృష్ణమూర్తి అసాధారణ ఆధ్యాత్మిక సేవలను గుర్తించి ఈ ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగింది.

ఆకోవకు చెందిన విద్యావేత్తలు, పండితులు ఆయన భవిష్యత్తు బాధ్యతలకు సంబంధించి కూడా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. టిటిడి అనుబంధ సంస్థ అయిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ సెక్రటరీ పదవికి శ్రీ పొన్న కృష్ణమూర్తి అత్యంత అర్హుడని, ప్రస్తుతం ఉన్న అధికారుల కంటే ఆయన అధికంగా అనుభవం, నైతిక ధృఢత్వం మరియు నిజాయితీతో పనిచేసే సామర్థ్యం కలిగి ఉన్నారని ఈ విద్యావేత్తలు నొక్కి వక్కాణిస్తున్నారు. తాను బాధ్యతలుచేపట్టిన తర్వాత తిరుమల లో అనేక మార్పులు తీసుకువచ్చిన టిటిడి చైర్మన్ బీ.ఆర్. నాయుడు గారు కూడా ఈ పదవికి కృష్ణమూర్తి ని సిఫార్సు చేయడం గమనార్హం. ఆయన ఈ బాధ్యతలోకి వస్తే, ధార్మిక పరిషత్ అద్భుతంగా పనిచేస్తుందని, టిటిడి తరపున ప్రజల్లోకి భక్తి చైతన్యాన్ని వ్యాప్తి చేసే భక్తి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తారని విశ్వసిస్తున్నారు. అనేక ఆర్ష, ప్రాచీన గ్రంథాలను లోతుగా అధ్యయనం చేసిన ఆయన, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించాలనే ఉత్తమ సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నారు.

### గుర్తింపు - ప్రశంసలివే...

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం: వైస్-ఛాన్సలర్ ఆచార్య రాణి సదాశివ మూర్తి జనవరి 20, 2026న ప్రశంసాపత్రం జారీ చేశారు.శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం: వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. ఉమ టెస్టిమోనియల్ జారీ చేస్తూ, కృష్ణమూర్తి రెండు దశాబ్దాలుగా తమకు తెలిసిన వ్యక్తి అని, ఆయన ఆధ్యాత్మిక దృష్టి మరియు ఉన్నత ఆశయాలు సాకారం కావాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం: వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ గుల్లపల్లి శ్రీరామ కృష్ణమూర్తి జనవరి 9, 2026న ప్రశంసాపత్రం జారీ చేయగాశ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం: రెక్టర్ ప్రొఫెసర్ అప్పారావు నవంబర్ 5, 2025న టెస్టిమోనియల్ జారీ చేశారు, ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం: ఎస్.వి. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. రెడ్డి శేఖర్ సెప్టెంబర్ 20, 2025న ప్రశంసాపత్రం జారీ చేశారు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిజాయితీ, నైతిక ధృఢత్వం, సేవా నిష్ఠ కలిగిన యోగ్యులైన వ్యక్తులకే బాధ్యతాయుతమైన పదవులు అప్పగిస్తారనేది జగమెరిగిన సత్యం.

# ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

- కార్యక్రమం విజయవంతానికి సమన్వయంతో పనిచేయండి
- ఆరోగ్య ఆంధ్ర, ఆరోగ్య భారత్ కు ఇది చాలా ముఖ్య కార్యక్రమం
- అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఫిబ్రవరి 13**

జిల్లాలో ఈ నెల 17న చేపట్టే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సమన్వయ శాఖల అధికారులు సమష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్య తదితర శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ 1-19 ఏళ్ల వారికి కార్యక్రమాన్ని అమలుచేయడం జరుగుతుందని, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు,



జూనియర్ కళాశాలలు, పాలిటెక్నికల్ తదితర విద్యాసంస్థల విద్యార్థులకు అల్బెండజోల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దాదాపు అయిదు లక్షల మంది చిన్నారులకు ఈ మాత్రలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులకు 200 ఎంజీ అల్బెండజోల్ (చప్పరించి మాత్రమే) ఇవ్వాలని.. అదేవిధంగా మిగిలిన వారికి 400 ఎంజీ సింగిల్ డోస్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నులిపురుగులు వల్ల పిల్లలు నీరసంగా ఉంటారని, శారీరక మానసిక ఎదుగుదల లోపాలు తలెత్తుతాయని.. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఈ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య ఆంధ్ర, ఆరోగ్య భారత్ సాకారానికి ఇది చాలా ముఖ్య కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య అధికారులు, మండల విద్యా శాఖాధికారులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. వివిధ కారణాల వల్ల ఫిబ్రవరి 17న మాత్రలు తీసుకోని చిన్నారులకు మాప్ అప్ డే రోజున ఈ నెల 24వ తేదీన అల్బెండజోల్ మాత్ర ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, ఆర్బీఎస్కే కార్యక్రమం కోఆర్డినేటర్ డా. జి.మాధవి, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, ప్రోగ్రామింగ్ అధికారులు, సమన్వయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎక్కడా చిన్న పొరపాటుకూ తావులేకుండా చూడాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఫిబ్రవరి 13 (**

ఎన్టీఆర్ జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీవోఎస్ఎస్) ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయ శాఖల అధికారులు బృంద స్ఫూర్తితో వ్యవహరించి.. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో ఓపెన్ ఇంటర్ పరీక్షలపై కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సమన్వయ శాఖల సమావేశం జరిగింది. పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మార్చి 2 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీవోఎస్ఎస్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. విజయవాడ డివిజన్కు సంబంధించి 603 మంది, నందిగామకు సంబంధించి 882 మంది, తిరువూరుకు సంబంధించి 369 మంది మొత్తం 1,854 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీటికోసం 11 పరీక్ష



కేంద్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లను నియమించడం జరిగిందన్నారు. 144 సెక్షన్ అమలు, బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం అవసరమన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ల ఏర్పాటుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ప్రజా రవాణా అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. నో సెల్ఫోన్ జోన్ నిబంధనలకు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సన్నద్ధంగా ఉండాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యంపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి సన్నద్ధతతో ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాలు కనుల పండుగగా నిర్వహించాలి

- బలివే ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష

**నూజివీడు, ఫిబ్రవరి 13**

బలివే మహాశివరాత్రి ఉత్సవాలను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి , ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులకు ఆదేశించారు. ముసునూరు మండలం బలివేలోని బలివే రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అధ్యక్షతన మంత్రి, కలెక్టర్ సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని చిన్న పొరపాటుకూ తావులేకుండా మహాశివరాత్రి ఉత్సవాలను కనుల పండుగగా నిర్వహించాలని సూచించారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేస్తున్నామని, మహాశివరాత్రి మహోత్సవాల అనంతరం పనులు ప్రారంభిస్తామని తెలిపారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని శాఖల వారీగా కేటాయించిన పనులపై సమీక్షించి సూచనలు జారీచేశారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ



జిల్లాలో పట్టిసీమ, బలివే ప్రాంతాల్లో మహాశివరాత్రి సందర్భంగా భారీగా భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించామని చెప్పారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పటిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు, త్రాగునీరు, ప్రథమ చికిత్స శిబిరాలు, మహిళలకు ప్రత్యేక మార్పిడి గదులు, చలువ పందిళ్లు, రాత్రివేళ విద్యుత్ దీపాలు, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారి సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. అనంతరం పుణ్యస్థానాల ఘాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో నూజివీడు డీఎస్పీ కె.వి.వి.యన్.వి. ప్రసాదు, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఈఓ పామర్తి సీతారామయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బొత్స వర్సెస్ లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలు పెట్టి పోయిందని, ఇప్పటివరకు రూ. 1859 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని లోకేశ్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూనియర్ కళాశాలల్లో సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల వివరాలను సభలో పెట్టేందుకు తాము సిద్ధమని మంత్రి లోకేశ్ తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పెట్టలేదని, ఫలితంగా 12 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలను వీడారని అన్నారు. దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూనియర్ కళాశాలల్లో సమస్యలన్నీ పరిష్కరించామని, ఆ కృషి ఫలితంగా జూనియర్ కళాశాలల్లో 70 వేల మంది విద్యార్థులు పెరిగారని లోకేశ్ తెలిపారు. మంత్రుల సమాధానంపై విపక్షనేత బొత్స అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ. 4 వేల కోట్లు కాదు కేవలం రెండు విడతలు మాత్రమే వైఎస్సార్సీపీ ప్రభుత్వం పెండింగ్లో పెట్టిందన్న బొత్స, కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోగా నిధులివ్వకుండా రాష్ట్రంలో విద్యావ్యవస్థను దారుణంగా దెబ్బతీశారని ఆరోపించారు. నిరసనగా మాత్రమే సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి వైఎస్సార్సీపీ సభ్యులు బయటకు వెళ్లిపోయారు. ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలపై చర్చకు వచ్చేందుకు భయపడి వైఎస్సార్సీపీ సభ్యులు వాకౌట్ చేస్తున్నారని మంత్రి లోకేశ్ మండిపడ్డారు. 16 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా నియంత్రణా చట్టం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని హోంమంత్రి అనిత చెప్పారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలపై జనసేన ఎమ్మెల్సీ నాగబాబు శాసనమండలిలో ఆవేదన వెలిబుచ్చారు. నాగబాబు అభిప్రాయంతో ఏకీభవించిన హోంమంత్రి పిల్లలకు అవగాహన కల్పించడంతోపాటు చట్టం తీసుకురావడంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. 2025-26 ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 1768 కోట్లు మంజూరు చేసి గిరిజన సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్సీల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 757 గిరిజన సంక్షేమ హాస్టళ్లలో 1,78,687 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్న మంత్రి, మెగా డీఎస్సీతో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 2 వేల మంది టీచర్లనునియమించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా టీచర్ల కొరత లేదన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, సహా విద్యార్థులకు సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ. 60 కోట్లు మంజూరు చేసి టాయిలెట్లు, ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. పోషకాహారం ఇచ్చేందుకు ప్రత్యేకంగా మెను ఇచ్చామని దాని ప్రకారం ఆహారం ఇవ్వకపోతే వార్డెన్ను సస్పెండ్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# మొబైల్ ఫోన్లను యజమానులకు అప్పగించిన పోలీసులు



శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా గోకవరం ఎస్సై వివిఎస్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి యజమానులకు అప్పగించారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ నెలలో తమ ఫోన్లను పోగొట్టుకున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు మొత్తం 12 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని వీటి విలువ సుమారు రెండు లక్షల నలభై వేలుగా అంచనా వేసినట్లు తెలిపారు. ప్రజలు తమ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని అలాగే సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు ప్రజలు సహకారంతో మరిన్ని కేసులు త్వరలోనే పరిష్కరించగలమని చెప్పారు. ప్రజలు తమ విలువైన వస్తువులు విషయంలో జాగ్రత్తగా ఉండాలని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు 9440904830 నెంబరుకు సమాచారం అందించాలని ఎస్సై పవన్ కుమార్ సూచించారు.

# టీవీకే ఎవరితోనూ పొత్తు పెట్టుకోదు


తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కజగం (టీవీకే) ఒం టరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ స్పష్టం చేశారు. తమ పార్టీ సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ఆ యన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు మార్పు ను కోరుకుంటున్నారని, తన 'విజిల్' గుర్తుకే ఓటర్లు మద్దతు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులోని సేలంలో శుక్రవా రం జరిగిన టీవీకే బహిరంగ సభలో అ ధికార డీఎంకే ప్రభుత్వంపై విజయ్ ఘాటు వి మర్శలు చేశారు. తమ రాజకీయ సభలకు అనుమతులు నిరాకరిస్తూ ఆంక్షలు విధించడాన్ని తప్పుబట్టారు. తాను రాజకీయాల్లోకి రావడమే తప్పు అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భం లోనే డీఎంకే ప్రభుత్వం ప్రకటించిన ఉచిత పథకాలు, వరాలపై విజయ్ కౌంటర్ ఇచ్చా రు. కేవలం ఎన్నికల సమయంలోనే ఇలాం టి హామీలు గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు. ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా చూడటం మానుకోవాలని సూచించారు. తాత్కాలిక ప్రయోజనాల కంటే శాశ్వత అభివృద్ధి ము ఖ్యం అని వ్యాఖ్యానించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పారదర్శకమైన పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. సభలో విజయ్ మాట్లాడుతుండగా మ హారాష్ట్రకు చెందిన సూరజ్ (37) అనే వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయాడు. ఎండ లో సుమారు రెండు గంటల పాటు వేచి ఉండటంతో తీవ్రమైన వేడికి ఆయన సొమ్మసిల్లి పడిపోయారు. ఆసుపత్రికి తరలిస్తుండ గానే మార్గమధ్యలో ఆయన కన్నుమూశా రు. సూరజ్ గత 20 ఏళ్లుగా సేలంలోనే నివసిస్తున్నారు. వెండి సంబంధిత కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడని, భార్యా, బిడ్డ తో కలిసి ఉంటున్నట్లు చెప్పారు. సూరజ్ గతంలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న ట్లు పోలీసులు గుర్తించారు. అనుమ తించిన సంఖ్య కంటే ఎక్కువ మందిని నిర్వాహకులు లోపలికి పంపడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. విచారణ జరిపి నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

# అమెరికా ఒప్పందంపై దేశవ్యాప్త ఉద్యమం!

కాంగ్రెస్ అగ్ర నేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్గాంధీ రైతు సంఘాల నేతలతో సమావేశమయ్యారు. శుక్రవారం పార్లమెంటు భవన సముదాయంలో జరిగిన ఈ భేటీలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, రైతులు, రైతు కూలీల జీవనోపాధిని కాపాడడంపై చర్చ జరిగింది. ఈ ఒప్పందాన్ని రైతు సంఘాల నేతలు వ్యతిరేకించారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పండ్లు, పప్పు ధాన్యాల రైతుల బతుకుదెరువు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ ఒప్పందంతో దేశంలోకి వ్యవసాయ దిగుమతులకు తలుపులు తెరుచుకుంటాయని.. ఇతర పంటలు కూడా భారత్లోకి ప్రవేశిస్తాయని రాహుల్ వారికి చెప్పారని కాంగ్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆయన్ను కలిసిన రైతు సంఘాల నేతల్లో సుఖ్పాల్ ఎస్.ఖైరా (ఆలిండియా కిసాన్ కాంగ్రెస్), అశోక్ బల్హారా (భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్, హరియాణా), బల్దేవ్ ఎస్.జీరా (బీకేయూ క్రాంతికారి), ఆర్.నందకుమార్ (ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ ఫ్రంట్), అమర్జిత్ మోహ్రీ (బీకేయూ షహీద్ భగత్సింగ్), గురునీత్ ఎస్.మంగత్ (కిసాన్ మజ్దూర్ మోర్చా-ఇండియా), హమీద్ మాలిక్ (జేకే జమీదారా ఫోరమ్) తదితరులు ఉన్నారని తెలిపింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ద్వారా ప్రధాని మోదీ దేశాన్ని అమ్మేస్తున్నారని రాహుల్ 'ఎక్స్'లో విమర్శించారు. తనపై ఎఫ్ఐఆర్ నమోదుచేసినా.. సభాహక్కుల తీర్మానం తెచ్చినా.. తాను రైతుల పక్షానే ఉంటానని స్పష్టం చేశారు. ఒప్పందానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వంపై తాను చేసిన విమర్శల వీడియోను ఈ సందర్భంగా పోస్టు చేశారు. 'రైతుల జీవనోపాధిని దెబ్బతీసి.. దేశ ఆహార భద్రతకు ముప్పు తెచ్చే ఏ ఒప్పందమైనా రైతు వ్యతిరేకమే.

# వైఎస్ జగన్ను మర్యాదపూర్వకంగా కలిసిన కొలుసు మోహన్ యాదవ్

## రాష్ట్ర కార్యదర్శిగా నియామకం అనంతరం తాడేపల్లిలో భేటీ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన కీలక నేత కొలుసు మోహన్ యాదవ్ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. పార్టీలో ఆరంభం నుంచి విధేయతతో పనిచేస్తున్న నేతలకు తగిన గుర్తింపు ఉంటుందని ఈ నియామకం ద్వారా మరోసారి స్పష్టం చేసినట్లైంది. నియామకం అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డిని కొలుసు మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శిగా క్షేత్రస్థాయిలో క్యాడర్ను ఏకం చేయాలని, ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కృష్ణా జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నెట్వర్క్ను బలోపేతం చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రస్తుత పరిస్థితులను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. జగన్ అప్పగించిన బాధ్యతను సవాలుగా స్వీకరిస్తానని కొలుసు మోహన్ యాదవ్ పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో వెన్నంటి నిలిచిన కార్యకర్తలకు అండగా ఉంటానని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో పనిచేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేసి, ప్రజా క్షేత్రంలో పార్టీ బలాన్ని చాటుతామని స్పష్టం చేశారు.

నినాదం



## స్టాండర్డ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కొత్త లోగో ఆవిష్కరణ

### జన్నారంలో రూ.240 కోట్లతో కొత్త యూనిట్

### ఆ కంపెనీ ఎండి కందుల నాగేశ్వర రావు వెల్లడి

హైదరాబాద్ : ప్రముఖ గ్లాస్, ఇంజనీరింగ్ ఉత్పత్తుల కంపెనీ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ తన బ్రాండ్ పరిణామ క్రమంలో భాగంగా స్టాండర్డ్ ఇంజనీరింగ్ టెక్నాలజీగా పేరు మార్చుకోగా.. తాజాగా నూతన లోగోను ఆవిష్కరించింది. కంపెనీ విస్తృతమైన సేవల పరిధిని ప్రతిబింబించేలా ఈ మార్పు చేపట్టామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందుల నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన కంపెనీ నూతన లోగోను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మెదక్ సమీపంలోని జన్నారంలో నూతన ఇంజనీరింగ్ ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను రూ.240 కోట్లతో అభివృద్ధి చేస్తోన్నామన్నారు. తొలి దశలో రూ.120 కోట్ల పెట్టుబడులను వ్యయం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఇది అందుబాటులోకి రానుందని తెలిపారు.కంపెనీ పేరు, లోగోలో మార్పు వచ్చినప్పటికీ తమ మూల వ్యాపారమైన గ్లాస్ లైనింగ్ రంగం నుండి తప్పుకోవడం లేదని నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గ్లాస్ లైనింగ్ అనేది ఇప్పటికీ కంపెనీ డిఎన్ఎలో అంతర్భాగమన్నారు. లాభదాయకమైన విభాగాలలో ఒకటిగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. గడిచిన 2024-25లో రూ.626 కోట్ల టర్నోవర్‌తో రూ.69 కోట్ల నికర లాభాలు సాధించింది. ఈ ఏడాది రెవెన్యూలో 27 శాతం వృద్ధిని అంచనా వేస్తోన్నామన్నారు. భవిష్యత్తులో గ్లాస్ లైనింగ్ వ్యాపారాన్ని మరింత బలోపేతం చేస్తూనే.. ఇతర ఇంజనీరింగ్, సమీకృత పరిష్కారాల విభాగాలలో వృద్ధిని వేగవంతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## రత్నాలు, ఆభరణాల ఎగుమతుల్లో పతనం

ముంబయి : అంతర్జాతీయ భౌగోళిక ప్రతికూలాంశాలు భారత రత్నాలు, అభరణాల ఎగుమతులను ఒత్తిడికి గురి చేస్తోన్నాయి. ముఖ్యంగా అమెరికా అమలు చేసిన అధిక టారిఫ్‌లు ఈ రంగం ఎగుమతులను క్షీణించేలా చేశాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే 2026 జనవరిలో రత్నాలు, అభరణాల ఎగుమతులు 5.79 శాతం పతనమై 2,238.54 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని జెమ్ అండ్ జ్యువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జిజెఇపిసి) శుక్రవారం వెల్లడించింది. 2025 ఇదే జనవరిలో 2,376 మిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయని పేర్కొంది. గడిచిన జనవరిలో పసిడి అభరణాల ఎగుమతులు 16.57 శాతం పతనమయ్యాయి. ముఖ్యంగా భారత్‌కు అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాలో సుంకాలు భారీగా పెరగడం వల్ల అక్కడికి ఎగుమతులు ఏకంగా 45 శాతం పడిపోయాయి. కాగా.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, హాంకాంగ్, ఆస్ట్రేలియా వంటి కొత్త మార్కెట్లలో రెండంకెల వద్ధి నమోదు కావడం భారత ఎగుమతిదారులకు కొంత ఊరటనిస్తోంది.

# ఏఐ భయాలతో మార్కెట్ల పతనం

## 25,500 దిగువకు నిఫ్టీ; 52 వారాల కనిష్టానికి పడిపోయిన ఐటీ షేర్లు



దేశీయ స్టాక్ మార్కెట్లలో పతనం కొనసాగుతోంది. బెంచ్‌మార్క్, సెక్టోరల్ సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. అన్ని రంగాల షేర్లు పతనమవ్వడంతో ఇన్వెస్టర్లు విలవిల్లాడారు. ఐటీ షేర్లు ఢమాల్ అనడంతో మొదట నిఫ్టీ 100 పాయింట్ల కనిష్ఠ స్థాయిలో చలించింది. ఫస్ట్ హాఫ్ వరకు రేంజుబౌండ్లోనే ఊగిసలాడింది. మధ్యాహ్నం నుంచి ఇన్వెస్టర్లు విపరీతంగా అమ్మకాలు చేపట్టడంతో సూచీలన్నీ మరింత ఎరుపెక్కాయి. మెటల్, కమోడిటీస్, రియాల్టి షేర్లు సైతం భారీగా నష్టపోయాయి. ఈ వారం కేవలం ఐటీ రంగంలోనే రూ.3లక్షల కోట్ల సంపద ఆవిరైంది.క్రితం సెషన్లో 83,674 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ శుక్రవారం 82,902 వద్ద మొదలైంది. 82,534 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 83,079 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 1048 పాయింట్ల నష్టంతో 82,626 వద్ద ముగిసింది. 25,571 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,444 వద్ద కనిష్ఠ, 25,630 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 336 పాయింట్లు తగ్గి 25,471 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 553 పాయింట్లు పతనమై 60,186 వద్ద స్థిరపడింది.నిఫ్టీ50లో 5 కంపెనీలు లాభపడగా 45 నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, ఐచర్ మోటార్స్, ఎస్బీఐ లైఫ్, ఎస్బీఐ, సిప్లా షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. హిందాల్కో, హిందుస్థాన్ యునీలివర్, ఎటర్నల్, అదానీ ఎంటర్ ప్రైజెస్, ఓఎన్జీసీ షేర్లు నష్టపోయాయి. నేడు మెటల్, కమోడిటీస్, రియాల్టి, సీపీఎస్ఈ, ఎనర్జీ, ఎంఎన్సీ, ఎఫ్ఎంసీజీ, చమురు, పీఎస్ఈ, ఐటీ, ఇన్ఫ్రా, బ్యాంకు, హెల్త్‌కేర్ సూచీలు విలవిల్లాడాయి.ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ పూర్తిగా సెల్లర్లకు అనుకూలంగా మారింది. మొత్తం 3249 స్టాక్స్ ట్రేడ్ అవ్వగా 766 లాభపడ్డాయి. 2388 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 44 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 131 తాకాయి. అప్పర్ సర్క్యూటును 66 లోయర్ సర్క్యూటును 67 చేరాయి.

డాలరుతో పోలిస్తే రూపాయి కాస్త బలహీనపడి 90.64 వద్ద స్థిరపడింది. హిందాల్కో ఇండస్ట్రీస్‌పై హెచ్ఎస్‌బిసి 'బై' రేటింగ్‌ను కొనసాగిస్తూ టార్గెట్ ధరను 1,210 రూపాయలుగా నిర్ణయించింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు చెందిన 5.89 మిలియన్ షేర్లు, అలాగే కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు చెందిన 5.19 మిలియన్ షేర్లు బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించబడ్డాయి. ఎన్‌సిఎల్ ఇండియా మూడవ త్రైమాసిక నికర లాభం గత ఏడాది 3 కోట్ల రూపాయల నుండి 13.2 కోట్ల రూపాయలకు భారీగా పెరిగింది. హెచ్‌యుఎల్ షేరుపై జెఫరీస్ 'బై' రేటింగ్‌ను కొనసాగిస్తూ 2,850 రూపాయల టార్గెట్ ధరను ఇచ్చింది. హెచ్‌ఏఎల్ షేరుకు నోమురా 'బై' రేటింగ్ ఇచ్చి లక్ష్య ధరను 6,000 రూపాయలుగా నిర్ణయించగా, టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ విభాగానికి 547 రూపాయల టార్గెట్ ధరను కేటాయించింది. పెట్రోనెట్ ఎల్ఎన్‌జిపై జెఫరీస్ 'అండర్ పర్ఫార్మ్' రేటింగ్‌ను కొనసాగిస్తూ 200 రూపాయల టార్గెట్ ధరను ఇచ్చింది. సీమెన్స్ ఎనర్జీ మొదటి త్రైమాసిక నికర లాభం 35 శాతం వృద్ధితో 313 కోట్ల రూపాయలకు చేరింది. హోనాసా కన్స్యూమర్ (మామ ఎర్త్) పై హెచ్ఎస్‌బిసి 'రెడ్యూస్' రేటింగ్ ఇచ్చి టార్గెట్‌ను 260 రూపాయలుగా నిర్ణయించింది. అయితే మామ ఎర్త్ లాభం 93 శాతం పెరగడంతో ఆ షేరు ఏడు నెలల గరిష్ట స్థాయిని తాకింది. భారతీ ఎయిర్‌టెల్ ప్రమోటర్లు ఇండస్ టవర్స్‌లో అదనంగా 20 లక్షల షేర్లను కొనుగోలు చేశారు. బజాజ్ ఫైనాన్స్ ఏఐ రంగంలో అడుగుపెట్టడం వల్ల పనితీరు మెరుగుపడుతుందని బ్రోకరేజ్ సంస్థలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అల్కెమ్ లాబొరేటరీస్ నికర లాభం 1.6 శాతం పెరిగి 636 కోట్ల రూపాయలుగా నమోదైంది. ఇప్కా ల్యాబ్ నికర లాభం 31.5 శాతం వృద్ధితో 326.3 కోట్ల రూపాయలకు చేరుకుంది. కోల్ ఇండియాకు హెచ్ఎస్‌బిసి 'హోల్డ్' రేటింగ్ ఇచ్చి 380 రూపాయల టార్గెట్ ధరను నిర్ణయించింది. ఇన్ క్రెడ్ సంస్థ భారత్ ఫోర్జ్ షేరుపై 'హోల్డ్' రేటింగ్ ఇచ్చింది. ఇండియన్ హోటల్స్ విషయమై మోర్గాన్ స్టాన్లీ 'ఈక్వల్ వెయిట్' రేటింగ్ ఇస్తూ 780 రూపాయల టార్గెట్ ధరను సూచించింది. ఇన్ఫో ఎడ్జ్ నికర లాభం త్రైమాసిక ప్రాతిపదికన 14 శాతం తగ్గి 271 కోట్ల రూపాయలుగా ఉంది. కిర్లోస్కర్ ఇండస్ట్రీస్ లాభం 15 శాతం తగ్గి 20.3 కోట్ల రూపాయలకు పరిమితమవ్వగా, ఎరిస్ లైఫ్ సైన్సెస్ నికర లాభం 19 శాతం పెరిగి 99.7 కోట్ల రూపాయలకు చేరింది.



**మూర్తినాయుడు పాదం**
నిఫ్టీ మాస్టర్, స్టాక్ మార్కెట్ అనలిస్ట్
988 555 9709

# వారెవ్వా జింబాబ్వే

### ఆస్ట్రేలియాపై 23 పరుగులతో ఘనవిజయం

### ముజరబాని, ఇవాన్స్ పేస్‌కు కంగారూ జట్టు కుదేలు బెనెట్ అర్ధ సెంచరీ

**ఆస్ట్రేలియా సొంతగడ్డపై ఆడినా... గడప దాటినా... ఫార్మాట్ ఏదైనా... చాంపియన్ జట్టు. ప్రొఫెషనలిజానికిమారుపేరు. అలాంటి జట్టు జింబాబ్వేలాంటి చిన్న జట్టుతో ఓడటం ఎవరి అంచనాలకూ అందని సంచలనమే! ఓ దుర్భేధ్యమైన జట్టు మళ్లీ అదే ప్రత్యర్థి చేతిలో రెండోసారి ఓడితే సంచలనానికి సీక్వెలే కదా!**





అవును... దాదాపు రెండు దశాబ్దాల తర్వాత టి20 ప్రపంచకప్‌లో జింబాబ్వే... ఆస్ట్రేలియాపై సీక్వెల్ బొమ్మ చూపించింది. 2007లో మొదలైన టి20 వరల్డ్‌కప్‌లో అప్పటి వన్డే వరల్డ్ చాంపియన్‌ను కంగుతినిపించి ఔరా అనిపించిన జింబాబ్వే... మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కూడా ప్రస్తుత వన్డే విశ్వవిజేత ఆస్ట్రేలియాను మట్టికరిపించి తాజా టి20 ప్రపంచకప్‌లో పెను సంచలనం నమోదు చేసింది. జింబాబ్వే జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాను మరోసారి '0'ను చేసింది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో జింబాబ్వే తమ ఆధిక్యాన్ని '2'తో రెట్టింపు చేసుకుంది. 2007 టి20 ప్రపంచకప్‌లో కంగారూ జట్టుపై సాధించిన సంచలన విజయాన్ని 19 ఏళ్ల తర్వాత జింబాబ్వే తాజాగా రిపీట్ చేసింది. అప్పుడు మొదటి ప్రపంచకప్ అయితే ఇది పదోది. మధ్యలో 8 మెగా ఈవెంట్లు జరిగినా... ఇరుజట్లు తలపడలేదు. శుక్రవారం గ్రూప్ 'బి'లో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 23 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను కంగుతినిపించింది. టాస్ నెగ్గిన ఆసీస్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్ చేపట్టిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (56 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. క్రీజులోకి వచ్చిన ముగ్గురు బ్యాటర్లు తదివనషె మరుమని (21 బంతుల్లో 35; 7 ఫోర్లు), రియాన్ బర్ల్ (30 బంతుల్లో 35; 4 ఫోర్లు), కెప్టెన్ సికందర్ రజా (13 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. స్టొయినిస్, కామెరాన్ గ్రీన్ చెరో వికెట్ తీశారు.





**ఆసీస్ ఈ 120 బంతులు ఆడలేదా?**

జింబాబ్వే లాంటి కూన జట్టు బ్యాటర్లు 120 బంతులెదుర్కొని ఇద్దరే అవుటైతే... జగజ్జేత కంగారు పడటమేంటి? పది మంది బ్యాటర్లు 117 బంతులకే అవుట్ కావడమేంటి? హెడ్ బృందానికి 170 లక్ష్యఛేదన ఏమాత్రం కష్టమైంది కాదు. కఠినమైంది కాదు. కానీ 19.3 ఓవర్లలోనే 146 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే పేసర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బ్లెసింగ్ ముజరబాని (4/19), బ్రాడ్ ఇవాన్స్ (3/23) ధాటికి ఓపెనర్లు ఇన్‌గ్లిస్ (8), కెప్టెన్ హెడ్ (17) గ్రీన్ (0), టిమ్ డేవిడ్ (0)... ఇలా టాప్--4 స్పెషలిస్టు బ్యాటర్లంతా పవర్‌ప్లేలో 29 పరుగులకే పెవిలియన్‌కు వెళ్లి ప్రేక్షకులైపోయారు.ఒకే ఒక్కడు మ్యాట్ రెన్‌షా (44 బంతుల్లో 65; 5 ఫోర్లు, 1 సిక్స్), మ్యాక్స్‌వెల్ (32 బంతుల్లో 31; 1 ఫోర్, 1 సిక్స్) ఐదో వికెట్‌కు 77 పరుగులు జోడించడంతో 100 పైచిలుకు స్కోరు చేయగలిగింది. లేదంటే తర్వాతి బ్యాటర్లు స్టొయినిస్ (6), డ్వార్షుయిస్ (6), ఎలిస్ (7 నాటౌట్), జంపా (2), కునెమన్ (0)ల స్కోర్లు చూస్తే ఏ అత్యల్ప స్కోరుకో పరిమితమయ్యేదేమో!

**ఔరా మన్యొంగా...**

జింబాబ్వే ఫీల్డర్ మన్యొంగా కళ్లు చెదిరే క్యాచ్‌తో ఆకట్టుకున్నాడు. ఇవాన్స్ వేసిన 18వ ఓవర్లో డ్వార్షుయిస్ మిడ్‌వికెట్ మీదుగా భారీ షాట్ ఆడాడు. మున్యొంగా దూరంగానే ఉన్నప్పటికీ డీప్ మిడ్‌వికెట్ నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి అదే వేగంతో డైవ్ చేసి అందుకున్న క్యాచ్ ఔరా అనిపించింది.

**టేలర్ స్థానంలో బెన్ కరన్...**

జింబాబ్వే సీనియర్ ప్లేయర్ బ్రెండన్ టేలర్ గాయం కారణంగా టోర్నీనుంచి తప్పుకున్నాడు. ఒమన్‌తో మ్యాచ్‌లో గాయపడిన అతను ఆసీస్‌తో పోరులో బరిలోకి దిగలేదు. టేలర్ స్థానంలో ఐసీసీ అనుమతితో బెన్ కరన్‌కు జింబాబ్వే చోటు కల్పించింది. బెన్ కరన్ తమ్ముడు స్యామ్ కరన్ ఇప్పటికే వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్ తరపున ఆడుతున్నాడు.2 ఇప్పటి వరకు ఆస్ట్రేలియా జట్టుతో జింబాబ్వే నాలుగు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో రెండింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. ఆసీస్‌పై జింబాబ్వే సాధించిన రెండు విజయాలు ప్రపంచకప్‌లోనే రావడం విశేషం



## నెదర్లాండ్స్‌పై అమెరికా గెలుపు

చెన్నై: ఐసిసి టి20 ప్రపంచకప్‌లో అమెరికా తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో అమెరికా 93 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై గెలిచింది. తొలిగా బ్యాటింగ్ దిగిన అమెరికాజట్టులో సాయితేజ(79)కి తోడు శుభమ్(48) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీస్కోర్ చేసింది. హర్మీత్ సింగ్(4/21), షాండ్లే(3/21), మహ్మద్(2/19) చెలరేగడంతో నెదర్లాండ్స్ 15.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. బాస్ డి లీడే (23) టాప్ స్కోరర్. హర్మీత్ సింగ్ దెబ్బకు నెదర్లాండ్స్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. అంతర్జాతీయ టి20ల్లో నెదర్లాండ్స్‌ను అమెరికా ఓడించడం ఇదే తొలిసారి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అమెరికాకు కెప్టెన్ మోనాంక్ పటేల్ (36), షయాన్ జహంగీర్(20) వేగంగా పరుగులు రాబట్టారు. ఆ తర్వాత సంజరు క్రిష్ణమూర్తి (1) విఫలమయ్యాడు. అయితే, సాయితేజ ముక్కామల అర్ధసెంచరీకి తోడు శుభమ్ రంజనె(48నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించడంతో అమెరికా జట్టు భారీస్కోర్ చేసింది. ఆఖరి ఓవర్లలో దూకుడుగా ఆడి జట్టు స్కోరును 196 పరుగులకు చేరింది. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడేకు మూడు, వాన్ బీక్, కైల్, ఫ్రెడ్ క్లాసెన్ తలో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్మీత్ సింగ్‌కు దక్కింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌లు ముగిసేసరికి అమెరికా ఒక గెలుపుతో 3వ స్థానానికి ఎగబాకింది.

## ఉత్కంఠ పోరులో యూఏఈ విజయం..



న్యూఢిల్లీ: గ్రూప్-డిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) జట్టు బోణీ కొట్టింది. నువ్వా-నేనా అన్నట్లు సాగిన ఉత్కంఠ పోరులో యుఎఇ జట్టు ఐదు వికెట్ల తేడాతో కెనడాపై గెలుపొందింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 150 పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని యుఎఇ జట్టు 19.4ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసి గెలిచింది. యుఎఇ బౌలర్ జునైద్ సిద్ధిఖీ(5/35) వికెట్ల వేటతో కెనడా బ్యాటర్లను దెబ్బకొట్టాడు. హర్ష్ ఠక్కర్(50), దిల్ప్రాల్(34) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఛేదనలో యుఎఇ జట్టును కెనడా బౌలర్ సాద్ బిన్ జఫర్(3/14) చెలరేగంతో 66కే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆ దశలో మరో వికెట్ పడి ఉంటే మ్యాచ్ చేజారేది. ఆ దశలో ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ(74 నాటౌట్), సొహైబ్ ఖాన్(51)లు అర్ధ సెంచరీలతో రాణించి యుఎఇని గెలుపు తీరాలకు చేర్చారు. ఐదో వికెట్‌కు ఆఖరి ఓవర్లో సొహైబ్ ఔట్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. మూడు బంతుల్లో ఒక పరుగు అవసరమవ్వగా.. అర్ఫాన్ సింగిల్ తీసి గెలిపించాడు. కెరీర్ బెస్ట్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన జునైద్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.





## ఎవర్నీ నిరుత్సాహపరచదు

"రెండు గంటల పాటు హాయిగా నవ్వించే సినిమా 'ఫంకీ'" అన్నారు హీరో విష్వక్ సేన్. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని అనుదీప్ కేవీ తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సందర్భంగా విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి చూసి ఎంజాయ్ చేసే చిత్రమిది. రెండు గంటలు ఎలా గడిచిపోయాయో తెలియనంతగా మీకిది వినోదాన్ని పంచుతుంది" అన్నారు. "ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. భీమ్స్ అద్భుతమైన సంగీతమందించారు" అన్నారు దర్శకుడు అనుదీప్. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "సినీ నేపథ్యంలో జరిగే కథ ఇది. దర్శకుడికి, నిర్మాత కూతురికి మధ్య జరిగే సరదా కథగా ఉంటుంది. అసలెవర్నీ నిరుత్సాహపరచదు" అన్నారు. ఓ ఇంటర్వ్యూలో తన గురించి నటుడు, దర్శకుడు అర్జున్ చెప్పిన మాటలు విన్నాక మంచిగా అనిపించిందని, ఆయన తెరకెక్కించిన 'సీతాపయనం'తో పాటు ఇతర చిత్రాలన్నీ ప్రేక్షకుల ఆదరణని సొంతం చేసుకోవాలన్నారు విష్వక్‌సేన్.




## మహాశివరాత్రి సందర్భంగా...

పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న యువ కథానాయకుల చిత్రాల్లో 'నాగబంధం' ఒకటి. విరాట్ కర్ణ కథానాయకుడిగా నటిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్య మేనన్ కథానాయికలు. జగపతిబాబు ముఖ్యభూమిక పోషిస్తున్నారు. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు చేతులమీదుగా టీజర్ విడుదల కానుందని చిత్రబృందం ఓ ప్రకటనలో తెలిపింది. పురాతనమైన రహస్యాలు, నాగబంధం సంప్రదాయంతో ముడిపడిన ఈ కథని ఒక అద్భుతంలా తెరపై ఆవిష్కరిస్తున్నామని, 1750 నేపథ్యంలో భారీ హంగులతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు సినీ వర్గాలు పేర్కొన్నాయి.




## మిస్టిక్ థ్రిల్లర్.. 'మార్కండేయ'


"ఇతిహాసాల నుంచి తీసుకున్న కథతో రూపొందిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ చిత్రమే 'మార్కండేయ'" అన్నారు హీరో విక్రాంత్. టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాని సిస్టా వీఎంకే తెరకెక్కిస్తున్నారు. దిల్‌రాజు డ్రీమ్స్ పతాకంపై నిర్మితమవుతున్న తొలి చిత్రమిది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది మహా శివరాత్రికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ కథ నచ్చి దీన్ని మా దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్‌లో తొలి చిత్రంగా ఎంచుకున్నాం. సీజీ వర్క్ ఎక్కువ ఉన్న చిత్రమిది. మా గ్లింప్స్‌కు అందరి నుంచి మంచి స్పందన లభించింది. మా చిత్ర బృందానికి ఇదే టానిక్. దేశంలో కొత్త వాళ్ల కోసం దిల్ రాజు డ్రీమ్స్ లాంటి మరో బ్యానర్ లేదు. అది మాకు గర్వంగా ఉంది. ప్రస్తుతం రెండు ఓటీటీ, మరో రెండు థియేట్రికల్ సినిమాలు సిద్ధం చేశాం. ఇక మా ఎస్వీసీ బ్యానర్‌లో 'రౌడీ జనార్ధన', 'ఎల్లమ్మ', 'దేత్తడి' చిత్రాలు చేస్తున్నాం" అన్నారు. "ఇతిహాసాల నుంచి తీసుకున్న మార్కండేయుడి పాత్రకు ఆధునిక రూపమే ఈ సినిమా. ఆ పరమ శివుడి దయతో హీరో తన సమస్యలకు సమాధానాలు వెతికి ఆ చిక్కుల్లోంచి ఎలా బయట పడ్డాడన్నది దీంట్లో చూపిస్తాం" అన్నారు హీరో విక్రాంత్.



## మన కథ మొదలే..

శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'విష్ణు విన్యాసం'. నూతన దర్శకుడు యదునాథ్ మారుతిరావు తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జీ నిర్మిస్తున్నారు. నయన్ సారిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేశ్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని త్వరలోనే థియేటర్ల ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మేకర్స్ సెకండ్ సింగిల్ 'మొదలే మొదలే..'ను విడుదల చేశారు. 'విన్నాలే.. వింటున్నాలే మనసున నీ మాట.. అన్నాలే.. అంటున్నాలే బదులుగ నా మాట.. మొదలే మొదలే మన కథ మొదలే.. మనకూ మనకూ ఇకపై రంగుల కలలే...' అంటూ సాగుతోందీ గీతం. రధన్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ పాటకు రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించగా మధుశ్రీ, నరేశ్ అయ్యర్ ఆలపించారు. ఈ గీతంలో శ్రీవిష్ణు, నయన సారిక కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీని అందించగా, ఏ రమణాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్‌గా, కార్తికేయన్ రోహిణి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

## ది ప్యారడైజ్ ఆగస్టుకు వాయిదా



నాని కథానాయకుడిగా నటిస్తున్న ద చిత్ర 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్‌బాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు హైదరాబాద్‌లో శరవేగంగా సాగుతోంది. టీమ్ ప్రస్తుతం నాని ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరిస్తోంది. తొలుత ఈ సినిమాను మార్చి 26న విడుదల చేయాలనుకున్నారు. నిర్మాతలు తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఆగస్టు 21న విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. అయితే, ఓనమ్, మిలాద్--ఉన్--నబీ, రక్షాబంధన్, శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగలు సినిమాకు వరుసగా మూడు వారాల పాటు కలిసి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్; డీవోపీ: సీహెచ్ సాయి; ఎడిటింగ్: నవీన్ నూలి; ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా.



## 'భలే భలే...' తర్వాత ఆ స్థాయి నవ్వులు

"నేను ఇదివరకు చేసిన 'భలే భలే మగాడివోయ్' తర్వాత మళ్లీ నన్ను అంతగా నవ్వించిన సినిమా ఇది. కథ వింటున్నప్పుడే ఎంతగానో ఆస్వాదించా" అన్నారు లావణ్య త్రిపాఠి. ఆమె, మలయాళ నటుడు దేవ్‌మోహన్ జంటగా నటించిన చిత్రం 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వం వహించారు. నాగమోహన్ నిర్మాత. ఈ చిత్రం మార్చి 6న రానుంది. విడుదల తేదీ ప్రకటన కోసం ఇటీవల హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. లావణ్య మాట్లాడుతూ "ఈ సినిమా నాకు చిత్ర పరిశ్రమకు పునరాగమనంలా అనిపిస్తోంది. ఒకవైపు తల్లి బాధ్యతల్ని, మరోవైపు వృత్తి పరమైన బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నా. అంతా కొత్తగా ఉంది. ఈ సినిమా మొదలైనప్పుడు నేను గర్భవతిగా ఉన్నా. నా కెరీర్‌లో ఎక్కువ కష్టంగా, ఎక్కువ సులభంగా అనిపించిన సినిమా ఇదే. దేవ్ మోహన్, సప్తగిరి చాలా బాగా నటించారు. అందరి ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. అయితే కమల్‌హాసన్ 'సతీ లీలావతి'తో మాత్రం నా సినిమాని పోల్చను" అన్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787